



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 354 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 24 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :354 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 24 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన, మత్స్యకారులకు హెచ్చరిక

- వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం
- ఉత్తరాంధ్రలో నేడు, రేపు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం
- తీరం వెంబడి గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని విపత్తుల సంస్థ హెచ్చరిక




పెన్ పవర్ డెస్క్:వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో

- మిగతా 2లో

## కాకినాడలో నర్సింగ్ విద్యార్థినుల ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా




**పెన్ పవర్ డెస్క్:** కాకినాడలోని ఎస్కే కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినుల ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో జిల్లా కలెక్టర్, ఎస్పీ రంగంలోకి దిగి విద్యార్థుల భద్రతకు చర్యలు చేపట్టారు. విద్యార్థినుల వసతి గృహాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను

- మిగతా 2లో



## బంగ్లాదేశ్‌లో ఘోరం.. హిందూ టీచర్ ఫ్యామిలీ దారుణ హత్య

పెన్ పవర్ డెస్క్:బంగ్లాదేశ్ లో దారుణం చోటుచేసుకుంది. విశ్రాంత హిందూ టీచర్ కుటుంబం హత్యకు గురైంది. తన ఇంటిపై డ్రగ్స్ తీసుకుంటుండడాన్ని ప్రశ్నించి నందుకు దుండగులు ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ సంఘటన రంగ్‌పుర్‌లో చోటుచేసుకుంది. పోలీస్ కమిషనర్ మహ్మద్ అబ్దుల్ వివరాలు వెల్లడించారు. గణపతి చక్రవర్తి (65) కొన్నేళ్ల క్రితం ప్రభుత్వ టీచర్‌గా రిటైర్డ్ అయి హోమియోపతి ప్రాక్టీస్ చేస్తున్నారు.

- మిగతా 2లో



## కారుమూరి అరెస్ట్..

### ప్రభుత్వ కక్షసాధింపు అంటూ విడదల రజని ఆగ్రహం

- మద్యం రవాణా కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అక్రమ అరెస్టు
- ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని మండిపడ్డ విడదల రజని
- బీసీ నేతలను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని ప్రభుత్వ తీరుపై ఆరోపణ
- టీడీపీ హయాంలోని మద్యం స్కామ్ నుంచి దృష్టి మరల్చేందుకే ఈ కుట్ర అని విమర్శ
- కారుమూరిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును అక్రమంగా అరెస్టు చేశారంటూ ఆ పార్టీ నేత, మాజీ మంత్రి విడదల రజని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని, దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ అరాచకాలకు ఇది పరాకాష్ఠ అని ఆమె ఆరోపించారు. లేని కేసును సృష్టించి వైసీపీ నేతలను ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని విమర్శిస్తూ తాడేపల్లిలో ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.గత ప్రభుత్వ హయాంలో మద్యం రవాణాలో అక్రమాలు జరిగాయనే నెపంతో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును హైదరాబాద్‌లో

- మిగతా 2లో

## ప్రభుత్వ పాఠశాలలపై కూటమిది అబద్ధాల ప్రచారం


- కూటమి ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్ తీవ్ర విమర్శలు
- యూడైస్ గణాంకాలతో ప్రభుత్వ వాదనలు అబద్ధమని ఆరోపణ
- ప్రభుత్వ పాఠశాలల్లో 5.56 లక్షల మంది విద్యార్థులు తగ్గారని వెల్లడి
- ప్రైవేటుకు మేలు చేసేందుకే ప్రభుత్వ విద్యను బలహీనపరుస్తున్నారని విమర్శ
- తమ హయాంలో నాడు-నేడు, ట్యాబ్‌లతో విద్యారంగాన్ని మార్చామని వెల్లడి



ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యా రంగంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రం లో ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా తగ్గిపోతున్నారని, కూటమి ప్రభుత్వం మాత్రం అబద్ధపు ప్రచారాలు చేసుకుంటోందని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడైస్ ప్లస్ గణాంకాలను ఉటంకిస్తూ సోషల్ మీడియా వేదికగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని ప్రచారం చేసుకోవడంపై జగన్ మండిపడ్డారు. ఇది వాస్తవమైతే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి కదా? అని ప్రశ్నించారు. కానీ, యూడైస్ గణాంకాల ప్రకారం 2023-24 విద్యా సంవత్సరంతో పోలిస్తే, 2025-26 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 40,50,116 నుంచి 34,93,450కి పడిపోయిందని, అంటే ఏకంగా 5,56,666 మంది విద్యార్థులు తగ్గిపోయారని జగన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45,53,380 నుంచి 48,40,296కు పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య కూడా 45 వేల నుంచి 44,222కు తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీకి నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ విద్యా సంస్థలతో ఉన్న సంబంధాల కారణంగానే, ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా బలహీనపరుస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. తద్వారా ప్రైవేటు సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం బాటలు వేస్తోందని అనుమానం వ్యక్తం చేశారు.

తమ హయాంలో విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని జగన్ గుర్తుచేశారు. 'మనబడి నాడు-నేడు' కింద రూ.8,524 కోట్లతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

- మిగతా 2లో



## జపాన్‌లో భూకంపం..

### నిలిచిన పోయిన రైళ్లు.. ఆగిపోయిన విద్యుత్ సరఫరా

పెన్ పవర్ డెస్క్:జపాన్ లో మరోసారి భూకంపం సంభవించింది. 2026 ఆగస్టు 23న తెల్లవారుజామున 5.9 తీవ్రతతో నమోదైన భూకంపంతో జపాన్ ఒక్కసారి గా ఊగిపోయింది. భవనాలు, వాహనాలు ఊగిపో వడంతో జనాలు ఉన్నట్లుండి కింద పడిపోయారు. వాహనాలు పట్టుతప్పి పడిపోయాయి. పెద్ద పెద్ద భవంతులు పెచ్చులు రాలటం, డ్యామేజ్ అవ్వటంతో భయాందోళనకర పరిస్థితులు ఏర్పడ్డాయి. దాదాపు 23 మంది గాయాలపాల య్యారు ఆదివారం తెల్లవారుజామన 2 గంటల ప్రాంతంలో ఇబరాకి పర్ఫెక్చర్ దక్షిణ

- మిగతా 2లో

## ఏపీ లిక్కర్ రవాణా స్కాం: మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్ట్

- ఏపీ మద్యం రవాణా కుంభకోణంలో మాజీ మంత్రి కారుమూరి అరెస్టు
- హైదరాబాద్ కొండాపూర్‌లో అదుపులోకి తీసుకున్న ఈడీ అధికారులు
- ఇప్పటికే కారుమూరి కుమారుడితో సహా ముగ్గురిని అరెస్ట్ చేసిన దర్యాప్తు సంస్థ
- రూ.195 కోట్లకు పైగా ఖజానాకు నష్టం జరిగిందని ప్రధాన ఆరోపణ
- ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో తప్పని అరెస్ట్


పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ కాగా, తాజాగా కారుమూరి అరెస్ట్‌తో దర్యాప్తు కీలక దశకు చేరుకుంది.ఇటీవల కారుమూరి నాగేశ్వరరావు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. జూలై 29న ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ స్కామ్ విలువ రూ.350 కోట్లకు పైగా ఉందని వ్యాఖ్యానిస్తూ, కస్టోడియల్ విచారణ అవసరమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఈడీ అధికారులు కారుమూరిని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

**ఏమిటీ మద్యం స్కామ్?**

గత ప్రభుత్వ హయాంలో

- మిగతా 2లో





## బాహుబలి జేసీబీతో గచ్చిబౌలిలో ప్రమాదకర భవనం కూల్చివేసిన హైడ్రా

- గచ్చిబౌలి ఆంజనేయ నగర్‌లో ప్రమాదకర భవనం కూల్చివేత
- మొన్న కూలిన భవనం పక్కనే దెబ్బతిన్న మరో నిర్మాణం
- సీఎంసీ, హైడ్రా ఆధ్వర్యంలో సంయుక్త ఆపరేషన్
- ముందుజాగ్రత్తగా సమీప అపార్ట్‌మెంట్ వాసుల తరలింపు
- అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించిన అధికారులు

పెన్ పవర్ డెస్క్:రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ఆంజనేయ నగర్‌లో శనివారం ఓ ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన నేపథ్యంలో, దాని పక్కనే ప్రమాదకరంగా మారిన మరో బహుళ అంతస్తుల భవనాన్ని

- మిగతా 2లో




## వందేమాతరం అంటే హిందూ దేవతల పూజ కాదు

- వందేమాతరం అంటే దేవతల ఆరాధన కాదని, భారతమాత ఆరాధన అని రాందేవ్ స్పష్టీకరణ
- గీతాన్ని ఒక మతానికి వ్యతిరేకమనడం మేధో దివాళాకోరుతనమని వ్యాఖ్య
- నిరసన ప్రదర్శనల్లోకి మైనర్లను తీసుకురావడం సరికాదని హితవు
- యూసీసీ అమలు చేసిన ఉత్తరాఖండ్ సీఎం ధామీని ప్రశంసించిన రాందేవ్
- కంగనా వ్యాఖ్యలపై తనదైన శైలిలో స్పందించిన యోగా గురు

- మిగతా 2లో

## అంతరిక్షంలో భారత్ 'నిఘా నేత్రాలు'.. శత్రు క్షిపణులకు సెకన్లలోనే చెక్!

- అంతరిక్షం నుంచి శత్రు క్షిపణి ప్రయోగాలను గుర్తించే సామర్థ్యంపై భారత్ దృష్టి
- ఆపరేషన్ సిందూర్ అనుభవంతో భూస్థిత రాడార్ల పరిమితులను అధిగమించే ప్రయత్నం
- 'ఎస్‌బీఎస్-3' ప్రాజెక్టుతో పాటు ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో పటిష్ఠ వ్యవస్థ నిర్మాణం
- బూస్ట్ దశలోనే క్షిపణిని గుర్తించి, దాడిని నిరోధించడానికి ఎక్కువ సమయం పొందడమే లక్ష్యం



పెన్ పవర్ డెస్క్:భారత రక్షణ రంగం సరికొత్త సాంకేతిక యుగంలోకి అడుగుపెడుతోంది. శత్రు దేశాల నుంచి ప్రయోగించే క్షిపణులను సెకన్ల వ్యవధిలోనే గుర్తించి, వాటిని గగనతలంలోనే ధ్వంసం చేసేందుకు వీలుగా అంతరిక్ష ఆధారిత ముందస్తు హెచ్చరిక వ్యవస్థను (స్పేస్-బేస్డ్ ఇన్‌ఫ్రారెడ్ ఎర్లీ-వార్నింగ్) భారత్ వేగంగా అభివృద్ధి చేస్తోంది. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఈ కీలక పరిణామం వెలుగులోకి వచ్చింది. 'అంతరిక్షంలో కళ్లు' (ఐస్ ఇన్ స్పేస్)గా పిలుస్తున్న ఈ వ్యవస్థ ద్వారా క్షిపణి ప్రయోగ సమయంలో దాని ఇంజిన్ల నుంచి వెలువడే అత్యధిక వేడిని (ఇన్‌ఫ్రారెడ్ సిగ్నేచర్) ఉపగ్రహాలు తక్షణమే పసిగడతాయి. దీంతో క్షిపణిని దాని ప్రయాణ మార్గంలోనే అడ్డగించి, నాశనం చేయడానికి భారత రక్షణ దళాలకు అమూల్యమైన సమయం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# లోకేష్ జగన్ పవన్... ఈ ముగ్గురి మధ్యనే !

ఏపీలో సార్వత్రిక ఎన్నికలకు ధీటుగా మరో భీకర సమరానికి తెర లేచింది. మరో రెండు నెలల వ్యవధిలో ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి. మొత్తానికి మొత్తం జనాలు ఈ ఎన్నికల్లోనూ ఓట్లు వేస్తారు. పల్లెలు పట్టణాలు మండలాలు నగరాలు అన్నింటికీ ఎన్నికలు ఉంటాయి. పైగా అన్ని వర్గాల ప్రజల అభిప్రాయం కూడా వ్యక్తం అవుతుంది. అంతే కాదు వివిధ సామాజిక వర్గాల ఆలోచనలు ప్రభుత్వం తీరు పట్ల వారి భావాలు కూడా స్థానిక ఎన్నికలలో ఎంతో కొంత వ్యక్తం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇక ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళ పై దాటింది. స్థానిక ఎన్నికల నాటికి రెండున్నరేళ్ళకు చేరువ అవుతుంది. దాంతో ప్రజలలో ఏమైనా అసంతృప్తి ఉందా లేక వారికి ఏ మేరకు సంతృప్తి స్థాయిలు ఉన్నాయన్నది కూడా ప్రాక్టికల్ గా తెలుసుకునే వీలు కలుగుతుంది.

**పోటా పోటీగా :**

స్థానిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు పోటా పోటీగా వ్యూహ రచన చేస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ అయితే ఇంటింటికీ తెలుగుదేశం అనే ఒక భారీ ప్రచార కార్యక్రమం చేపట్టింది. ఇది రెండు నెలల పాటు సాగనుంది. ఇదంతా స్థానిక ఎన్నికల కోసమే అన్నది తెలిసిందే. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం అలాగే అభివృద్ధి వీటి మీద నేరుగా ఇళ్ళకు వెళ్ళి ఎమ్మెల్యేలు సీనియర్ నాయకులు వివరించడం అన్నది టీడీపీ వ్యూహంలో భాగంగా చూస్తున్నారు. ఆ మీదట ఎటూ ఎన్నికల ప్రచారం ఉంటుంది. ముందు గ్రౌండ్ లెవెల్ లో ఓటర్ కి ఒక పాజిటివ్ వైబ్ ని కలిగించేందుకే ఇంటింటికీ టీడీపీ అని అంటున్నారు.

**లోకేష్ రంగంలోకి :**

ఇక ఈసారి స్థానిక ఎన్నికల సమరంలో లోకేష్ నేరుగా రంగంలోకి దిగుతున్నారని అంటున్నారు. ఆయన టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్. ఒక విధంగా పార్టీని అంతా ఆయన చూస్తున్నారు. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం గురించి నిరంతరం సమీక్ష కూడా చేస్తున్నారు. ఇక లోకల్ బాడీ ఎన్నికల్లో వ్యూహరచనలో కూడా యువనేత బిజీగా ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో లోకేష్ గట్టిగా పాల్గొనే చాన్స్ ఉందని అంటున్నారు. అలాగే అభ్యర్థుల ఎంపిక కానీ మేయర్ వంటి కీలక స్థానాలకు సమర్థులైన వారిని బరిలోకి దించడంలో కానీ లోకేష్ ఫుల్ ఫోకస్ పెట్టనున్నారు అని ప్రచారం సాగుతోంది. ఈ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచి టీడీపీని తిరుగులేని స్థానంలో ఉంచాలని లోకేష్ పట్టుదలగా ఉన్నారని అంటున్నారు. ఒక విధంగా లోకేష్ సత్తాకు ఈ ఎన్నికలే ముందస్తు పరీక్ష అని చెబుతున్నారు.

**పవన్ పట్టుదలకు :**

జనసేన అంటే త్యాగాల పార్టీ కాదని పట్టుబట్టి సాధించుకునే పార్టీ అని పవన్ కళ్యాణ్ ఈసారి నిరూపించబోతున్నారు అని అంటున్నారు. అంతే కాకుండా అధిక సీట్లను పొత్తులో రాబట్టడమే కాకుండా 2024 నాటి సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ సక్సెస్ ని రిపీట్ చేయాలని పవన్ చూస్తున్నారు అని అంటున్నారు. గ్రాస్ రూట్ లెవెల్ లో బలమైన పునాది వేసుకుని పార్టీని 2029 ఎన్నికల నాటికి తిరుగులేని శక్తిగా మార్చాలని పవన్ గట్టి సంకల్పం తీసుకున్నారని అంటున్నారు. ఒక విధంగా పవన్ ఇంత సీరియస్ గా ఎన్నికల వ్యూహాలను రచించడం అంటే జనసేన దూకుడు వేరే లెవెల్ అవుతుందని ఆ పార్టీ నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఇక పవన్ వ్యూహాలకు ఎన్నికలలో జనసేన అందుకే ఫలితాలకు ఒక మచ్చుతునకగా లోకల్ ఫైట్ నిలుస్తుందని అంటున్నారు. అలా జరగాలని అంతా కోరుకుంటున్నారు.

**జగన్ సైతం సై అంటూ :**

జగన్ కూడా స్థానిక ఎన్నికల బరిలోకి సీరియస్ గానే అడుగు పెడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల మీదనే ఎక్కువ ఫోకస్ పెట్టే జగన్ ఈసారి మాత్రం లోకల్ సత్తా చూపాలని తపన పడడం వైసీపీ రాజకీయ జాతకాన్ని మార్చనుందా అన్న చర్చ సాగుతోంది. అదే సమయంలో జగన్ 2024 నాటి చేదు ఫలితాలను నాటి అనుభవాలని మరిపించేలా లోకల్ బాడీ ఎన్నికల్లో ఫ్యాన్ పార్టీ జోరుని చూపించాలని అనుకుంటున్నారు. దాంతో తాను మాత్రమే దూకుడు చేయడం కాకుండా పార్టీని కూడా పరుగులు పెట్టించాలని చూస్తున్నారు. దాంతో ఈసారి స్థానిక సమరం ప్రధానంగా లోకేష్ జగన్ పవన్ ల మధ్యనే కేంద్రీకృతం అవనుంది అని అంటున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలపై కూటమిది అబద్ధాల ప్రచారం

- మొదటి పేజి తరువాయి

కల్పించామని, విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశామని వివరించారు. ఆంగ్ల మాధ్యమాన్ని ప్రోత్సహిస్తూ టోఫెల్ వంటి అంతర్జాతీయ స్థాయి శిక్షణకు సైతం శ్రీకారం చుట్టామని తెలిపారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యారంగం తిరోగమనంలో పయనిస్తుండటం ఆందోళనకరమని జగన్ అన్నారు. ప్రభుత్వ ప్రచారంలోని డొల్లతనాన్ని ఈ లెక్కలే బయటపెడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

# కాకినాడలో నర్సింగ్ విద్యార్థినుల ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా

- మొదటి పేజి తరువాయి

అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్నా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవసరమైన వసతి కల్పించడంతో పాటు.. పరిస్థితి మరింత ఉద్రిక్తం కాకుండా చర్యలు తీసుకున్నారు. అధికారుల చొరవతో సమస్య సామరస్యపూర్వకంగా పరిష్కారమైంది. అధికారులు స్పందించిన తీరుపై ఈశాన్య రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

**ఏం జరిగిందంటే?**

ఎస్కే కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో విద్యార్థినుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తన ఫోన్ పోయిందంటూ మణిపూర్‌కు చెందిన

ఓ విద్యార్థిని ఇటీవల సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం తలెత్తింది. ఫోన్ దొరికినప్పటికీ గొడవ సద్దుమణగకపోవడంతో ఏపీ, మణిపూర్ విద్యార్థినులు పరస్పరం ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి.

# వందేమాతరం అంటే హిందూ దేవతల పూజ కాదు

'వందేమాతరం' గీతం పూర్తి రూపంలో ఆలపించడంపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో, యోగా గురు బాబా రాందేవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ గీతంలోని సాహిత్యం హిందూ దేవతలైన దుర్గ, లక్ష్మి వంటి వారిని పూజించడం గురించి కాదని, కేవలం 'భారతమాత'కు చేసే ఆరాధన అని ఆయన ఆదివారం స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాందేవ్ మాట్లాడుతూ.. "మేము భారతమాతనే దుర్గగా, లక్ష్మిగా భావిస్తాం. ఆమే మా విశ్వాసం, మా జ్ఞానం, మా ఆలయం. వందేమాతరంలో దేవతలను, ఆలయాలను చూసేవారు మన సంస్కృతికి దూరమైన వారు. భారతమాత ఆరాధనను దేవతలతో ముడిపెట్టి ఒక మతానికి వ్యతిరేకమని చెప్పడం మేధో దివాళాకోరుతనం" అని అన్నారు. విద్యార్థుల నిరసనల గురించి ప్రస్తావిస్తూ, చిన్న పిల్లలను నిరసనల్లోకి లాగడాన్ని ఆయన తప్పుబట్టారు. "5, 10 ఏళ్ల పిల్లలను కూడా పోలీస్ స్టేషన్లను ముట్టడించాలని, ఎస్పీలు, డీఎంలను ఘెరావ్ చేయాలని ప్రోత్సహిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. అయితే, 18 ఏళ్లు నిండిన వారు ఎక్కడ అన్యాయం జరిగినా తప్పక పోరాడాలి" అని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా కుల దూషణలపైనా రాందేవ్ స్పందించారు. "షెడ్యూల్డ్ కులాలు లేదా తెగల వారిని అవమానించడం రాజ్యాంగ విరుద్ధమైనప్పుడు, బ్రాహ్మణులను దూషించడం కూడా ప్రజాస్వామ్యానికి విరుద్ధమే" అని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలు చేసిన ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీని

ఆయన ప్రశంసించారు. ఇటీవల తన వ్యక్తిగత జీవితంపై వ్యాఖ్యలు చేయవద్దని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన సూచనపై రాందేవ్ స్పందిస్తూ.. "స్వామి రాందేవ్ ఎవరో, ఆయన సేవ ఏంటో ఈ దేశ ప్రజలకు తెలుసు. అందువల్ల, అలాంటి స్థాయి వ్యక్తుల గురించి నేను ఎలాంటి వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు" అని అన్నారు.

# కారుమూరి అరెస్ట్.. ప్రభుత్వ కక్షసాధింపు అంటూ విడదల రజని ఆగ్రహం

- మొదటి పేజి తరువాయి

అక్రమంగా అరెస్టు చేశారని రజని పేర్కొన్నారు. బీసీ నేత అయిన కారుమూరి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని, కొద్ది రోజుల క్రితం ఆయన కుమారుడు సునీల్‌ను కూడా అరెస్టు చేశారని, ఇప్పుడు ఆయనను అరెస్టు చేయడాన్ని పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇద్దరు రిటైర్డ్ ఉన్నతాధికారులను కూడా అన్యాయంగా జైల్లో పెట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం సరఫరా, విక్రయాలు పారదర్శకంగా జరిగాయని, దుకాణాల సంఖ్య తగ్గించడంతో పాటు అక్రమ మద్యాన్ని పూర్తిగా అరికట్టామని రజని స్పష్టం చేశారు. పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపులను నిర్మూలించామని గుర్తుచేశారు. అయితే, 2014–19 మధ్య చంద్రబాబు హయాంలో మద్యం సరఫరా, విక్రయాల్లో భారీగా అక్రమాలు జరిగాయని ఆమె ఆరోపించారు. బార్ల యజమానులకు అనుకూలంగా వ్యవహరించి, ప్రివిలేజ్ ఫీజులు మాఫీ చేసి ఖజానాకు నష్టం కలిగించారని విమర్శించారు. అప్పట్లో మద్యం అమ్మకాలు పెరిగినా ప్రభుత్వ ఆదాయం పెరగలేదని, ఆ అవకతవకలపై

చంద్రబాబుపై కేసు కూడా నమోదైందని తెలిపారు. ఆ కేసు నుంచి బయటపడటానికే, తమ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలతో కేసులు బనాయించి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని రజని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కారుమూరి నాగేశ్వరరావును తక్షణమే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# జపాన్‌లో భూకంపం.. నిలిచిన పోయిన రైళ్లు.. ఆగిపోయిన విద్యుత్ సరఫరా

- మొదటి పేజి తరువాయి

ప్రాంతంలో 68 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రం నమోదైనట్లు క్యోడో న్యూస్ రిపోర్ట్ చేసింది. అయితే సునామీ ప్రమాదమేమీ లేదని జపాన్ భూకంప కేంద్రం తెలిపింది. భారీ కుదుపుల కారణంగా రైళ్లను ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. స్టేషన్లలో ఉన్న ట్రైన్స్ షెడ్యూల్ డిలే చేశారు. ప్రజలు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ప్రభుత్వ వర్గాలు పిలుపునిచ్చాయి. దీనికి తోడు విద్యత్ సరఫరా నిలిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సెంట్రల్ టోక్యోలోని ఉయెనోను చిబా ప్రిఫెక్చర్‌లోని నరిటా ఎయిర్ పోర్ట్ ను కలిపే కీసే లైన్, ఉదయం 9:40 గంటల తర్వాత సాధారణ కార్యకలాపాలు మొదలైనట్లు క్యోడో న్యూస్ నివేదించింది. అయితే, టోబు రైల్వే ఎక్స్‌ప్రెస్ మార్గాలు నిలిచిపోయినట్లు వెల్లడించింది. ఈ భూకంపం కారణంగా 23 మంది గాయపడగా.. ఇద్దరు చనిపోయినట్లు ఫైర్, విపత్తు నిర్వహణ అధికారులు వెల్లడించారు. టోక్యోకు ఉత్తరాన ఉన్న సైతామా ప్రిఫెక్చర్‌లో ఒక యువకుడు, 70 ఏళ్ల ఒక మహిళ చనిపోయినట్లు తెలిపారు. రాజధానికి సరిగ్గా దక్షిణాన ఉన్న కవాసాకిలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు పేర్కొన్నారు. భూకంపం వల్ల జరిగిన నష్టాన్ని నిర్ధారించి, ప్రజలకు సకాలంలో సమాచారాన్ని అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు ప్రధాని సనాయ్ తకైచి .

# బాహుబలి జేసీబీతో గచ్చిబౌలిలో ప్రమాదకర భవనం కూల్చివేసిన హైడ్రా

- మొదటి పేజి తరువాయి

అధికారులు కూల్చివేశారు. సీఎంసీ (సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), హైడ్రా బృందాలు సంయుక్తంగా ఆదివారం ఉదయం ఈ ఆపరేషన్ చేపట్టాయి. శనివారం సాజిద్ అనే వ్యక్తికి చెందిన భవనం కూలిపోవడంతో, దాని శిథిలాలు పక్కనే ఉన్న మరో ఏడంతస్తుల భవనంపై పడ్డాయి. దీంతో ఆ భవనం కూడా తీవ్రంగా దెబ్బతిని, ఏ క్షణమైనా కూలిపోయే స్థితికి చేరింది. ఈ నిర్మాణం వల్ల చుట్టుపక్కల భవనాలకు, ప్రజలకు పెను ప్రమాదం పొంచి ఉందని సీఎంసీ అధికారులు నిర్ధారించారు. వారి అభ్యర్థన మేరకు హైడ్రా బృందాలు రంగంలోకి దిగి కూల్చివేత పనులను ప్రారంభించాయి. ఈ భవనాలు అత్యంత సమీపంలో, ఎలాంటి ఖాళీ స్థలం లేకుండా నిర్మించడంతో కూల్చివేత సవాలుగా మారింది. 'బాహుబలి' జేసీబీ వంటి భారీ యంత్రాలను ఉపయోగిస్తూ, సమీపంలోని ఇతర నిర్మాణాలకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కూల్చివేత నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని స్టెర్లింగ్ వైట్‌ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌లోని నివాసితులను ఇళ్లు ఖాళీ చేయించారు. ఆ ప్రాంతంలోకి ప్రజలు రాకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆంజనేయ నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం 50 గజాల స్థలంలోనే ఏడంతస్తుల వరకు పేకమేడల్లా భవనాలు నిర్మించారని అధికారులు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించడంతో కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ ఘటనతో అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నట్లు స్పష్టమవుతోంది.

# ఏపీ లిక్కర్ రవాణా స్కాం: మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

ఏపీలో మద్యం రవాణా టెండర్ల ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయన్నది ప్రధాన ఆరోపణ. టెండర్ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా మార్చి, సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్స్ వంటి సంస్థలకు అనుకూలంగా వ్యవహరించారని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. మార్కెట్ రేట్ల కన్నా ఎక్కువ ధరకు కాంట్రాక్టులు కట్టబెట్టడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.195.33 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఏపీ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ విచారణ కొనసాగిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో రాజ్ కెసిరెడ్డి, అప్పటి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి కీలకపాత్ర పోషించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈ సిండికేట్‌లో మాజీ మంత్రి కారుమూరి, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌కు కూడా వాటా ఉందని, వారి కుటుంబానికి సుమారు రూ.10 కోట్లకు పైగా ముడుపులు అందినట్లు దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది.

ఈ కేసులో భాగంగా జూన్ నెలలో ఈడీ విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. మొదట రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలను అరెస్ట్ చేసింది. అనంతరం కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ కుమార్‌ను కూడా అదుపులోకి తీసుకుంది. ఇప్పుడు మాజీ మంత్రి కారుమూరిని కూడా అరెస్ట్ చేయడంతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం కానుంది.

# బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన, మత్స్యకారులకు హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

నేడు, రేపు పలుచోట్ల మోస్తరు నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. సముద్రం అలజడిగా ఉండి, కెరటాలు ఎగసిపడే ప్రమాదం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. ఐఎండీ నివేదిక ప్రకారం, ఆగస్టు 23, ఆదివారం ఉదయం నాటికి ఈ అల్పపీడనం వాయువ్య బంగాళాఖాతంలోనే స్థిరంగా కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. రుతుపవన ద్రోణి కూడా ఈ అల్పపీడన ప్రాంతం మీదుగా కొనసాగుతుండటంతో దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు, అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

# బంగ్లాదేశ్‌లో ఘోరం.. హిందూ టీచర్ ఫ్యామిలీ దారుణ హత్య

- మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం రంగ్‌పుర్‌లో కొత్త ఇంటిని నిర్మించుకుని భార్య ప్రీతిలత (50), కుమార్తె అగామీ (23), కుమారుడు ప్రియమ్ (12)తో కలిసి ఉంటున్నారు. చక్రవర్తి భార్య ప్రీతిలతకు ఆమె సోదరి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. మిగతా కుటుంబ సభ్యుల ఫోన్లు సైతం కలవకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు శనివారం రాత్రి తాళం వేసి ఉన్న ఆ ఇంటి తలుపులను పగలగొట్టి చూడగా నలుగురు హత్యకు గురై కనిపించారు. చక్రవర్తి మృతదేహం ఇంటి పైకప్పు మీద, భార్య, కుమార్తె మృతదేహాలు మెట్లపై, కుమారుడి మృతదేహం ఇంట్లోని మంచం కింద లభ్యమయ్యాయి. గురువారం రాత్రి ఈ హత్యలు జరిగినట్లు పోలీస్ కమిషనర్ మహ్మద్ అబ్దుల్ తెలిపారు. ఇద్దరు దుండగులు డ్రగ్స్ తీసుకోవడానికి చక్రవర్తి ఇంటిపైకి వెళ్లారు. దాన్ని గమనించిన గణపతి వారిని ప్రశ్నించడంతో తమను గుర్తుపట్టారని, టవల్‌తో మెడకు చుట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. ఈ క్రమంలో శబ్దం రావడంతో భార్య ప్రీతిలత పైకి వెళ్లగా ఆమెను సైతం గొంతునులిమి హత్య చేశారు. అనంతరం వారి పిల్లలను చంపారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను గుర్తించి విచారిస్తున్నట్లు తెలిపారు.

# అంతరిక్షంలో భారత్ 'నిఘా నేత్రాలు'.. శత్రు క్షిపణులకు సెకన్లలోనే చెక్!

- మొదటి పేజి తరువాయి

లభిస్తుంది. గతంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' ఈ కొత్త వ్యవస్థ ఆవశ్యకతను స్పష్టం చేసింది. ఆ సమయంలో పాకిస్థాన్ ప్రయోగించిన ఒక హై-స్పీడ్ క్షిపణి ఢిల్లీ వైపు దూసుకొస్తుండగా, హర్యానాలోని సిర్సా వద్ద భారత వాయు రక్షణ వ్యవస్థ దానిని అడ్డగించింది. అయితే, క్షిపణి లక్ష్యాన్ని చేరడానికి కేవలం ఒకటి, రెండు నిమిషాల సమయం మాత్రమే ఉండగా ఈ అడ్డగింత సాధ్యమైంది. భూమిపై ఉన్న రాడార్లు భూమి వక్రత (ఏబతీఙఖ్బతీవ) కారణంగా ఒక పరిమితి మేరకే పనిచేస్తాయి. దీంతో ముప్పును గుర్తించడానికి తక్కువ సమయం ఉంటుంది. ఈ సమస్యను అధిగమించి, శత్రువు దాడిని ముందుగానే పసిగట్టడమే అంతరిక్ష ఆధారిత సెన్సార్ల ప్రధాన లక్ష్యం.

**వ్యవస్థ పనిచేసే విధానం**

బాలిస్టిక్ క్షిపణులు ప్రధానంగా మూడు దశల్లో ప్రయాణిస్తాయి. మొదటిది 'బూస్ట్' దశ. ఈ సమయంలో ఇంజిన్లు మండి, తీవ్రమైన వేడిని విడుదల చేస్తాయి. అంతరిక్షంలోని ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లు ఈ వేడిని ప్రయోగించిన సెకన్ల వ్యవధిలోనే గుర్తిస్తాయి.

రెండోది 'మిడ్‌కోర్స్' దశ. ఈ దశలో క్షిపణి వాతావరణం బయట ప్రయాణిస్తుంది.

మూడోది 'టెర్మినల్' దశ. ఈ దశలో క్షిపణి అత్యంత వేగంతో (మాక్ 15కు పైగా) లక్ష్యం వైపు దూసుకొస్తుంది.

భూస్థిత రాడార్లు కేవలం టెర్మినల్ దశలోనే క్షిపణిని గుర్తించగలవు. కానీ అంతరిక్షంలోని ఉపగ్రహాలు బూస్ట్ దశలోనే గుర్తించి హెచ్చరికలు పంపుతాయి. దీనివల్ల 'కిల్ చైన్' (గుర్తించడం, ట్రాక్ చేయడం, ధ్వంసం చేయడం) ప్రక్రియ చాలా ముందుగా ప్రారంభమవుతుంది. దీంతో వాతావరణం లోపల, వెలుపల కూడా క్షిపణిని కూల్చివేసేందుకు అవకాశం లభిస్తుంది. డీఆర్‌డీఓ ఇప్పటికే ఇటువంటి క్షిపణి విధ్వంసక పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది.

**ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం**

ఈ అత్యాధునిక వ్యవస్థ రూపకల్పనలో భారత ప్రభుత్వం, ప్రైవేట్ స్టార్టప్‌లు కలిసి పనిచేస్తున్నాయి. బెంగళూరుకు చెందిన 'దిగంతర' స్టార్టప్ 'ఆల్బ్రాటాస్' ఉపగ్రహాలతో బూస్ట్ దశలోనే క్షిపణులను గుర్తించే సాంకేతికతపై పనిచేస్తోంది. అహ్మదాబాద్‌కు చెందిన 'శాట్‌లియో ల్యాబ్స్' 15 ఉపగ్రహాలతో కూడిన థర్మల్ అబ్జర్వేషన్ వ్యవస్థను నిర్మిస్తోంది. ఇవి క్షిపణి ప్రయోగం వంటి అత్యధిక ఉష్ణోగ్రత ఘటనలను గుర్తించి, రియల్ టైమ్‌లో సమాచారం అందిస్తాయి. ఈ ప్రైవేట్ ప్రయత్నాలకు తోడుగా, కేంద్ర భద్రతా కేబినెట్ కమిటీ (జజూ) 'స్పేస్-బేస్డ్ సర్వైలెన్స్ ఫేజ్-3' (ఎస్‌బీఎస్-3) అనే భారీ కార్యక్రమానికి ఆమోదం తెలిపింది. సుమారు రూ.27,000 కోట్ల వ్యయంతో 2029 నాటికి 52 ఉపగ్రహాల (21 ఇస్రో, 31 ప్రైవేట్) సమూహాన్ని అంతరిక్షంలో మోహరించనున్నారు. ఈ నెట్‌వర్క్ నిరంతర నిఘా, శత్రువుల మొబైల్ లాంచర్ల ట్రాకింగ్, కమ్యూనికేషన్స్ వంటి బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. ఈ బహుళ అంచెల రక్షణ వ్యూహం ద్వారా శత్రువు ఆకస్మిక దాడులు చేసే అవకాశాలను తగ్గించి, భారత రక్షణ సామర్థ్యాన్ని అసాధారణ స్థాయికి తీసుకెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

వెలిగొండ ప్రాజెక్టు.. మూడు జిల్లాలకు దశాబ్దాల కల.. ఆ కల నెరవేరింది. కానీ ఆ కల వెనుక కన్నీటి వరద ఉంది. మార్కాపురం జిల్లాలోని అర్ధవీడు, మార్కాపురం, పెద్దారవీడు మూడు మండలాల్లోని 11 గ్రామాలకు చెందిన 7,555 నిర్వాసిత కుటుంబాలు ఇప్పుడు భారమైన హృదయాలతో తమ గ్రామాలను ఖాళీ చేస్తున్నాయి. ఒక్క ఆరు నెలలు సమయం ఇవ్వండని వేడుకున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇలా హడావుడిగా ఊరు ఖాళీ చేయమనడం న్యాయం కాదని వారు కన్నీరు మున్నీరు అవుతున్నారు.

ఈ ప్రాజెక్టు నిర్వాసితుల కుటుంబాల త్యాగాలపై "పెన్ పవర్" ప్రత్యేక కథనం...

# తలుపులు మూసి.. జ్ఞాపకాలను మూటగట్టుకుని..!

**ఊర్లు ఖాళీలవుతున్నాయి, జ్ఞాపకాలు మిగిలిపోతున్నాయి**
**వెలిగొండ నీళ్ల వెనుక.. వెల్లువెత్తుతున్న కన్నీళ్లు**
**వెలిగొండ కోసం గ్రామాలను వదిలి వెళ్తున్న నిర్వాసితులు**
**ప్రతి అడుగులోనూ కన్నీరు.. ప్రతి గడపలోనూ జ్ఞాపకం**






**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 23**

జిల్లాలో వెలిగొండ ముంపు గ్రామాలైన 11 గ్రామాల్లో ఇప్పుడు కనిపిస్తున్న దృశ్యాలు ఎవరి గుండెలనైనా పిండేస్తాయి. అర్ధవీడు, మార్కాపురం, పెద్దారవీడు మండలాల పరిధిలోని 7,555 కుటుంబాలు తరతరాలుగా బతికిన ఊరు, ఆడుకున్న వీధి, పుట్టిన ఇల్లు, కట్టుకున్న గూడు అన్నీ వదిలి పెట్టెబేడ సర్దుకుని వెళ్తున్న కుటుంబాలను చూస్తే కన్నీరు ఆగదు.

**భుజాన పెట్టె.. చేతిలో మనవడు.. గుండెలో ఊరి జ్ఞాపకం..**

ఉదయం 6 గంటలకే ఊరంతా లేచింది. కానీ పొలం పనుల కోసం కాదు.. ఊరు ఖాళీ చేయడం కోసం. ఈ ఊర్లో మాకు ఇంకా ఏం ఉంది అక్కా ఓ..అంటూ 70 ఏళ్ల లక్ష్మమ్మ భుజాన పెట్టె బేడతో, చేతిలో 5 ఏళ్ల మనవడిని పట్టుకుని నడుస్తుంటే, ఆమె వెనుక ఆమె కొడుకు ట్రాక్టర్ పై మంచం, టీవీ, బియ్యం డబ్బా వేసుకుని వస్తున్నాడు. ఇళ్ల తలుపులు మూస్తూ, గోడలను తడిమి చూస్తూ, పెరట్లో తను నాటిన వేప చెట్టును, ముందు వాకిట్లో తన చేతులతో పెంచిన మల్లె మొక్కను చివరిసారి ముట్టుకుంటూ ఆమె వెళ్తున్న తీరు చూస్తే అక్కడ ప్రతి ఒక్కరి కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి. ఈ చెట్టును నా పెళ్లయిన కొత్తలో నాటాను బిడ్డా.. ఇప్పుడు దీన్ని కూడా వదిలి వెళ్లాలా..అంటూ ఆమె కన్నీరు పెట్టుకుంది.ఆరు నెలలు ఆగండి బిడ్డా పిల్లల బడులు, కొత్త ఇంటి ఏర్పాట్లు చేసుకుంటాం అంటే వినలేదు అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

**ప్రతి ఇంటికి ఒక చరిత్ర.. ప్రతి గోడకు ఒక కథ..**

ఇక్కడ ప్రతి ఇంటికి ఒక చరిత్ర ఉంది. గోడలపై పిల్లల ఎత్తు గీతలు, వాకిట్లో ఆడుకున్న బొమ్మలు, అరుగు మీద పెద్దలు చెప్పిన కబుర్లు.. అన్నీ ఇప్పుడు గతంగా మారిపోతున్నాయి. రామయ్య తాత తన పొలం గట్టు మీద కూర్చుని ఈ 10 ఎకరాల్లో నా తాత, నా తండ్రి, నేను.. మూడు తరాలు బతికాం. ఈ మట్టిని పట్టుకునే బతికాం. ఇప్పుడు ఈ మట్టినే వదిలి వెళ్తున్నాం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు మాత్రం తాము ఆడుకున్న బడి, తమ స్నేహితులు, తమ ఊరి చెరువును వదిలి వెళ్లలేక బిక్కమొహం వేస్తున్నారు. మా బడి కూడా మునిగిపోతుందా సార్ అని ఓ చిన్నారి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పేవారు లేరు.

**చివరి రోజుల్లో సమాధి కూడా ఇక్కడే అనుకున్నా.. వృద్ధుల ఆవేదన**

యువకులు కొత్త చోటుకు వెళ్లి బతుకు తెరువు చూసుకుందామనే ఆలోచనలో ఉంటే, వృద్ధుల పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది.మా బతుకు ఇక్కడే అయిపోతుందనుకున్నాం బిడ్డా.. చివరి రోజుల్లో మా సమాధి కూడా ఇక్కడే ఉంటుందనుకున్నాం. ఇప్పుడు ఊరు వదిలి ఎక్కడికి వెళ్లాలి అంటూ 80 ఏళ్ల సుబ్బయ్య తాత కన్నీరు పెట్టుకున్నారు. తమ పిల్లల పెళ్లిళ్లు, తమ మనవళ్ల పుట్టుకలు అన్నీ ఈ ఊరిలోనే జరిగాయని, ఇప్పుడు ఆ జ్ఞాపకాలను మూటగట్టుకుని వెళ్లడం తప్ప ఏమీ లేదని వారు వాపోతున్నారు. కొందరు తమ పూర్వీకుల సమాధుల దగ్గర చివరిసారి దీపం వెలిగించి, నమస్కరించి వెళ్తున్న దృశ్యాలు మరింత బాధాకరం.

**బండ్లపై సామాన్లు.. గుండెల్లో బరువు..**

ఊరంతా ఒకేసారి ఖాళీ అవుతున్నట్లుగా ఉంది. ఎద్దుల బండ్లపై సామాన్లు, ట్రాక్టర్లపై మంచాలు, కుర్చీలు, తలపై బియ్యం డబ్బాలు, చంకలో పిల్లలు, ప్రతి కుటుంబం కథ ఇదే. మూడు మండలాల్లోని 11 గ్రామాల ప్రజల పరిస్థితి ఇదే. వెళ్తున్న ప్రతి ట్రాక్టర్ వెనుక ఒక ఊరు మిగిలిపోతోంది. వెళ్లిపోయిన ఇళ్ల తలుపులు తెరిచి ఉన్నాయి కానీ లోపల మనుషులు లేరు. వీధుల్లో పిల్లల అరుపులు లేవు, అరుగులపై పెద్దల కబుర్లు లేవు. మిగిలింది కేవలం నిశ్శబ్దం, జ్ఞాపకాలు మాత్రమే. ప్రాజెక్టు కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన ఆ 7,555 కుటుంబాల త్యాగం ముందు ఎవరైనా తలవంచాల్సిందే.

**ఇది నిర్వాసం కాదు.. ఒక తరం జ్ఞాపకాల సమాధి..**

అధికారులు ఇచ్చే పరిహారం వారి ఇంటి విలువను, పొలం విలువను కట్టవచ్చు.. కానీ వారి జ్ఞాపకాల విలువను ఎవరు కడతారు? 11 గ్రామాల ప్రజలు అడుగుతున్నది కేవలం ఆరు నెలల సమయం మాత్రమే. కొత్త చోట సర్దుకునేందుకు, పిల్లల చదువులు, ఇళ్ల నిర్మాణం కోసం ఆ మాత్రం గడువు కూడా ఇవ్వరా అని వారు ప్రశ్నిస్తున్నారు. తమ ఊరి మట్టి వాసనను, తమ వీధి గాలిని, తమ ఇంటి గోడలకు ఉన్న మమకారాన్ని ఎవరు తిరిగి ఇస్తారు? వెలిగొండ నీళ్లు రాష్ట్రానికి దాహం తీరుస్తాయి.. కానీ ఆ నీళ్ల వెనుక 7,555 కుటుంబాల కన్నీరు ఉందని, 11 ఊర్ల త్యాగం ఉందని ఈ తరం గుర్తుంచుకోవాలి. ఇది కేవలం నిర్వాసం కాదు ఒక ఊరి చరిత్రకు, ఒక తరం జ్ఞాపకాలకు కట్టిన సమాధి.




# గిద్దలూరు పారిశ్రామికంగా అభివృద్ధే లక్ష్యం

**నూతన ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవం**

**ఎమ్మెల్యే ముత్తుముల**

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 23**

పట్టణంలోని నంద్యాల హైవే రోడ్డు సమీపంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయ ఇండస్ట్రీస్ ను ఆదివారం నాడు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నూతన పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు. విజయ ఇండస్ట్రీస్ విజయవంతంగా అభివృద్ధి చెందాలని, నిర్వాహకులకు మంచి పేరు, అభివృద్ధి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విజయ ఇండస్ట్రీస్ నిర్వాహకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మిట్టపాలెంలో నిరుపయోగంగా టీటీడీ కల్యాణ మండపం

**ఇంకెంతకాలం వేచి చూడాలి ?**

**మౌలిక వసతులు కల్పించి మండపాన్ని అందుబాటులోకి తేవాలి**

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 23**

జిల్లాలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం సమీపంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన టీటీడీ కల్యాణ మండపం నిరుపయోగంగా ఉండటంపై పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసినప్పటికీ, ఇప్పటివరకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదని పలువురు గ్రామస్తులు తెలిపారు నారాయణస్వామి దేవస్థానానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటుంటారు. దేవస్థానానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ఇక్కడ వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకునేందుకు భక్తులు, స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. అయితే టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన కల్యాణ మండపం వినియోగంలోకి రాకపోవడంతో శుభకార్యాలు నిర్వహించుకునే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. కల్యాణ మండపం అందుబాటులో లేకపోవడంతో స్థానికులు, భక్తులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు కల్యాణ మండపాలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో వివాహాలు చేసుకునే మధ్యతరగతి, నిరుపేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన మండపం అందుబాటులోకి వస్తే తక్కువ ఖర్చుతో శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం ఉంటుందని, కల్యాణ మండపానికి అవసరమైన సదుపాయాలను కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుకుంటున్నారు.

**ఇంకెంతకాలం వేచి చూడాలి?..:** టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం పూర్తయి సుమారు 13 సంవత్సరాలు గడిచిన ప్రజలకు అందుబాటులోకి రాలేదు అధికారులు పాలకుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ అందుబాటులోకి రాలేదని, కల్యాణ మండపం అందుబాటులోకి వస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు వెంటనే అధికారులు స్పందించి మండపాన్ని పరిశీలించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తా

**-ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యం -బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉన్నం భాస్కరరావు**

**-దేశం కోసం పనిచేసే పార్టీ బిజెపి మాత్రమే -జిల్లా ఇన్చార్జి భరత్ కుమార్ యాదవ్**





**కందుకూరు పెన్ పవర్,ఆగస్టు 23**

ప్రకాశం జిల్లాలో భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తానని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, బి.ఆర్. ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు అన్నారు. పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేసేలా పనిచేస్తానని తెలిపారు. ప్రకాశం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఉన్నం భాస్కరరావును బి.ఆర్. ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల యాజమాన్యం, అధ్యాపకులు, బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కందుకూరు పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న బి.ఆర్. ఆక్స్ఫర్డ్ స్పోర్ట్స్ క్యాంపస్‌లో జరిగిన అభినందన సభ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రకాశం జిల్లా ఇన్చార్జి భరత్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ దేశం కోసం నిరంతరం పనిచేస్తున్న పార్టీ బీజేపీ మాత్రమేనని అన్నారు. బీజేపీలో పదవులు సాధించాలంటే ఎంతో ఓపిక, పట్టుదల, కష్టపడే తత్వం అవసరమని పేర్కొన్నారు. ఉన్నం భాస్కరరావు ఈ స్థాయికి చేరుకోవడం అదృష్టం అని అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో కందుకూరు నియోజకవర్గంలో బీజేపీ మరింత బలోపేతం అయ్యే అవకాశాలు ఉన్నాయని భరత్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారంలో పార్టీ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలో ఉందని, తెలంగాణలోనూ పార్టీ ఒంటరిగా అధికారంలోకి వచ్చే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీజేపీని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ అభివృద్ధి కోసం 24 గంటలూ శ్రమిస్తున్నారని భరత్ కుమార్ యాదవ్ అన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే జాతీయ భావం, దేశభక్తి పెంపొందించే విధంగా విద్యాసంస్థలు నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులు భవిష్యత్‌లో దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

**విద్యారంగంలో ఉన్నం భాస్కరరావు సేవలు అభినందనీయం...**

బి.ఆర్. ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల డైరెక్టర్ జి. బాలభాస్కరరావు మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ విద్యాసంస్థను జిల్లాలోనే అగ్రగామిగా నిలిపేందుకు చైర్మన్ ఉన్నం భాస్కరరావు చేసిన కృషి, పట్టుదలే ప్రధాన కారణమని కొనియాడారు. ఆయన మార్గదర్శకత్వంలో గ్రామీణ, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఉత్తమ ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఉన్నం భాస్కరరావు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. సన్మానం అనంతరం ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి, సహకరించిన నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని చెప్పారు. జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీకి బలమైన పునాదులు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసులు, జిల్లా ఇన్చార్జి భరత్ కుమార్ యాదవ్, కందుకూరు నియోజకవర్గ కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, పల్నాడు జిల్లా ఇన్చార్జి తోగంటి శ్రీనివాసరావు, కందుకూరు పట్టణ అధ్యక్షుడు మురళీధర్, బి.ఆర్. ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు జి. బాలభాస్కరరావు, బి. నరేంద్రబాబు, సీనియర్ నాయకులు దామోదర్, భూషయ్య, రాఘవులు, ప్రసాద్, సురేష్, రావి సరిత, నాగరాజకుమారి, టిడిపి నాయకులు వడ్లమూడి సురేష్, గుర్రం మాల్యాద్రి, అబ్బూరి వేణు, ఉప్పుటూరి సుబ్బారావు, మాదాల గోపీనాథ్, దామా వెంకటేశ్వర్లు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, విద్యాసంస్థల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

8,9

గ్రంథాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు

**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 23**

సంతమాగులూరు మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో బాదం విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగినది. అనంతరం





చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రకేసరి స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు స్వాతంత్ర కోసం ఎన్నో పోరాటాలు చేశారని, తొలి ముఖ్యమంత్రిగా ఆయన పరిపాలన చేయడం ఎంతో గొప్ప విషయం అని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా అభివృద్ధి కోసం ఎంతో పాటు పడ్డారని, అంతేకాకుండా బీద, మధ్య తరగతులకు ఆయన ఆర్థికంగా పదకాల ద్వారా ఎంతో బలాన్ని చేకూర్చారాని, ఎన్నో మంచి పనులు చేసి ప్రజల గుండెల్లో స్థిరంగా నిలిచిపోయారని ఆయన కొనియాడారు. అనంతరం శాఖా గ్రంధాలయంలో నిర్వహించిన చదివంటే మాకు ఇష్టం కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని విద్యార్థులు ఈ విధంగా పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథ పాఠకులు పాల్గొన్నారు.

## సీఎం వెలిగొండ పర్యటనను విజయవంతం చేయండి: ఎమ్మెల్యే కందుల





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 23**

ఈ నెల 31వ తేదీన జరగనున్న సీఎం వెలిగొండ ప్రాజెక్టు పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జవహర్ నగర్ లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల టీడీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ ఈనెల 31న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు నుండి నల్లమల సాగర్ కు నీటి విడుదల చేయడానికి వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ కార్యకర్తలు, నాయకులు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. ఇప్పటికే మార్కాపురం జిల్లాను ప్రకటించామని, నియోజకవర్గంలో ప్రతి ఇంటికి పైప్ లైన్ తీసుకువచ్చామని, త్వరలో దాన్ని పూర్తి చేసి ప్రతి ఇంటికి కృష్ణా నది జలాలను అందిస్తామని అన్నారు. హార్టికల్చర్ హబ్ ద్వారా జిల్లాకు త్వరలో ఐదు వేల కోట్ల నిధులు రాబోతున్నాయని, దీని ద్వారా ఈ ప్రాంతం సమూలంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ విషయాలను ప్రతి ఒక్కరు ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## నివాళులు అర్పించిన ముత్తుముల

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 23**

గిద్దలూరు మండలం గడికోట గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త ముత్తూరి పెద్ద సుబ్బ రాయుడు (68) అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి వారి నివాసం వద్దకు వెళ్లి పూల మాలతో ఘనంగా నివాళు లు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటుగా గిద్దలూరు మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



# వైభవంగా ఆంధ్రకేసరి జయంతి వేడుకలు

## –ఆంధ్రకేసరి ధైర్యసాహసాలు, త్యాగనిరతిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 23**

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలను కందుకూరులో ఆంధ్రకేసరి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సేవాసమితి అధ్యక్షులు మంచిరాజు వెంకట మురళీ మోహన్ లండన్ నుంచి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ నిర్వాహకులకు తగిన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన ఆంధ్రకేసరి కాంస్య విగ్రహానికి పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు ప్రకాశం పంతులు ధైర్యసాహసాలు, త్యాగనిరతి, ప్రజాసేవను కొనియాడారు. ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రైతు సంఘం నాయకులు అల్లం వెంకటేశ్వర్లు, ముస్లిం మైనార్టీ అధ్యక్షులు రఫీ, రాష్ట్ర తెలుగు యువత నాయకులు బెజవాడ ప్రసాద్, పట్టణ తెలుగు యువత నాయకులు చవిడి బోయిన కృష్ణయాదవ్, తొట్టెంపూడి వేణు, ఆర్ఎస్ఎస్ కందుకూరు ప్రాంత సంఘ్ చాలక్ డాక్టర్ తన్నీరు మల్లిఖార్జున, జనతా పార్టీ నాయకులు ఘట్టమనేని హరిబాబు, బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు జగన్నాథం వైకుంఠం, సీనియర్ బీజేపీ నాయకులు ముప్వల భూషయ్య, జొన్నాదుల రాఘవులు, మన్నేపల్లి వరప్రసాదరావు, పట్టణ అధ్యక్షులు చుండి మురళీధర్, మహిళా మోర్చా నాయకురాలు రావి



సరిత తదితరులు పాల్గొన్నారు.ఆంధ్రకేసరి సేవాసమితి ప్రధాన కార్యదర్శి యిప్పగుంట సుబ్రహ్మణ్యం, స్కందపురి బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు (ఆర్.వి), కార్యదర్శి పిన్నమరాజు ప్రభాకరరావు, నందనవనం రామసుబ్బారావు, రావులకొల్లు బ్రహ్మానందం, టంగుటూరు సుబ్బారావు, కాకర్ల రాజగోపాల్, పాలూరి సతీష్, గణపతిరాజు శేషగిరిరావు, వెల్లటూరి శరత్ తదితరులు పాల్గొన్నారు. కందుకూరు పట్టణ ఆర్యవైశ్య పెద్దలు మురారిశెట్టి వెంకటసుబ్బారావు, ఇస్కాల మధు, చక్కా వెంకట కేశవరావు, మురారిశెట్టి సుధీర్, కొటకిశోర్, సుబ్బారాయుడు, బ్రాహ్మణ యువతకు చెందిన చలంచర్ల రమణమూర్తి, బి.వి.ఎల్.ఎన్. మూర్తి, నందనవనం ఉమామహేశ్వరరావు, గాదిరాజు నాగరాజు, కొండపి శ్రీనివాసరావు, వేదాల కమలాకర్ తదితరులు



హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా కందుకూరు ఎం.ఈ.ఓ.–1 ఎం. నాగకుమార్ శర్మ, ఎం.ఈ.ఓ.–2 సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఆంధ్రకేసరి అభిమానులు, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ సామాను బ్రహ్మయ్య, గుమ్మా శివ, చల్లా మహేంద్ర తదితరులు ప్రకాశం పంతులుకు నివాళులర్పించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆంధ్రకేసరి సేవాసమితి బాధ్యులు నారాయణం రాధాకృష్ణమాచార్యులు, చలంచర్ల సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు.

## టెట్‌పై ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

### –ప్రత్యేక టెట్ నిర్వహించి ఉత్తీర్ణత శాతాన్ని తగ్గించాలి

### –నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు




**కందుకూరు, పెన్ పవర్ ఆగస్టు 23**

రాష్ట్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు టెట్ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు అన్నారు. కందుకూరు పట్టణంలో నిర్వహించిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కందుకూరు ప్రాంతీయ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఉపాధ్యాయులు టెట్ విషయంలో తీవ్ర ఆందోళనలో ఉన్నారని శ్రీనివాసరాజు తెలిపారు. ఇటీవల నిర్వహించిన టెట్ పరీక్షలు సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఉత్తీర్ణత సాధించడానికి చాలా క్లిష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి, సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులందరూ ఉత్తీర్ణత సాధించేలా ఉత్తీర్ణత శాతాన్ని తగ్గించాలని కోరారు. పరీక్షను మాన్యువల్ విధానంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా ఉద్యోగులకు రావాల్సిన అన్ని బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం ప్రత్యేక రోడ్‌మ్యాప్ రూపొందించాలని డిమాండ్ చేశారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులను సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు వారికి మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని అన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు కూడా మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని శ్రీనివాసరాజు ప్రభుత్వాన్ని కోరారు.

**పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి...**

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నడిపినేని వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులకు ఇప్పటికే రూ.27 వేల కోట్ల బకాయిలు విడుదల చేసినట్లు తెలిపారు. అయితే 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ఎర్న్‌డ్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్‌ను నియమించి, మధ్యంతర భృతి (ఐఆర్) విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ రమేష్‌బాబు, వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు ఏబీ రామకృష్ణమరాజు, అన్నమయ్య జిల్లా గౌరవ అధ్యక్షుడు బచ్చల శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు టి. శ్రీనివాసులు, కందుకూరు ప్రాంత నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫా స్కూల్ విద్యార్థులు.. మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహణ

### ప్రిన్సిపల్ రితీష్ టి నాయర్ –విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలకు మాక్ అసెంబ్లీ వేదిక

### ప్రజాస్వామ్యంపై అవగాహన కల్పించిన ఆల్ఫా స్కూల్ విద్యార్థులు









**పెన్ పవర్ కంభం ఆగస్టు 23:**

విద్యార్థులకు ప్రజాస్వామ్య విధానాలను శాసనసభ పనితీరును నేర్పడానికి ఒక గొప్ప మార్గం. ఇది విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను మాట్లాడే ధైర్యాన్ని పెంచుతుంది. కంభం పట్టణంలోని ఆల్ఫా స్కూల్ నందు విద్యార్థుల ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ రితీష్ టి నాయర్ పర్యవేక్షించారు. ముందుగా విద్యార్థులకు స్పీకర్ ముఖ్యమంత్రి మంత్రులు శాసనసభ్యుల పాత్రలను ఇవ్వడం జరిగింది. ఉపాధ్యాయుల సహాయంతో ప్రశ్నోత్తరాలు చర్చా వేదికకు కావలసిన సంభాషణలను ముందే సిద్ధం చేశారు. ఒక తరగతి గదిని అసెంబ్లీ వేదిక గా అమర్చారు. అనంతరం విద్యార్థులు స్పీకర్ సభను ప్రారంభించడం మరియు ప్రశ్నోత్తరాల సమయం నిర్వహించడం జరిగింది. విద్యార్థి ప్రతినిధులు ప్రజాస్వామ్యాల వై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం అంటే కార్యక్రమం నిర్వహించారు. మంత్రులు వాటికి సమాధానాలు మరియు హామీలు ఇవ్వడం జరిగింది ఒకే బిల్లుపై చర్చ జరిగి ఆమోదం పొందడం అంటే కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు నైపుణ్యాలు సామాజిక అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## జనసేన నాయకుడు పెనుగొండ సుబ్బరాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన బుచ్చయ్య గుప్తా

**కందుకూరు పెన్ పవర్,ఆగస్టు 23**

రాష్ట్ర జనసేన పొలిటికల్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు పెనుగొండ సుబ్బరాయుడు ని ఆదివారం విజయవాడలో ఆయన నివాసమందు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించిన కందుకూరు జనసేన పార్టీ నాయకులు మానేపల్లి బుచ్చయ్య గుప్తా. ఈ సందర్భంగా బుచ్చయ్య గుప్తా మాట్లాడుతూ తన నాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టినప్పుడు నుంచి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా నడుస్తున్నామని అన్నారు. అటువంటి జనసేనలో క్రియాశీలకంగా పనిచేస్తున్న పెనుగొండ సుబ్బరాయుడు ని కలవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.



## నారాయణస్వామిని దర్శించుకున్న భక్తులు





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 23**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు, వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ శాస్త్రోక్తంగా అభిషేక పూజలు నిర్వహించారు అనంతరం స్వామివారి మూలవిరాట్, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు భక్తి సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించిన గోపూజ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ ఆవరణలోని గోశాలలో గోవును అలంకరించి మేళతాళాల నడుమ వేదమంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా గోపూజ నిర్వహించారు. గోమాతను లక్ష్మీ స్వరూపిణిగా భావిస్తూ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. తదుపరి స్వామివారికి సమర్పించనున్న మహా నైవేద్యాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం అర్చకులు గోత్రనామాలతో మంత్రోచ్చారణలతో భక్తులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేసిన అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమాలలో ఆలయ సిబ్బంది. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## తెలుగు భాషా మహోత్సవంలో నెమ్మానికి సన్మానం



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 23**

మల్లెతీగ మాసపత్రిక సాహిత్య సేవా సంస్థ నిర్వహించిన తెలుగు భాషా మహోత్సవంలో ఒంగోలుకు చెందిన సాహితీవేత్త నెమ్మాని సీతారామమూర్తిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. విజయవాడ బందర్ రోడ్, ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, నిర్వహణ సంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ ,తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

## ఉచిత వైద్య శిబిరం ఏర్పాట అభినందనీయం. గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ బి.వి.రంగారావు

### వైద్య శిబిరంలో 500 మందికి పైగా వైద్య పరీక్షలు



**పెన్ పవర్ ,కంభం ఆగస్టు 24**

ప్రతి ఒక్కరు తమ వంతు ప్రజాసేవ చేసేందుకు ముందుకు రావాలని అప్పుడే పేదలకు కొంత వైద్య సేవలు ఉచితంగా అందుతాయని కంభం పట్టణంలోని యశస్విని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు ముందుకు రావడం జరిగింది. ఆదివారం యశస్విని మల్టీస్పెషల్టి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ షర్మిల భర్త దండు విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ బి.వి.రంగారావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య బృందం డాక్టర్లు విరంచి యాదవ్, నారు రమణారెడ్డి జోత్స్న ప్రత్యూష డాక్టర్ ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. శిబిరంలో బీపీ షుగర్ తో పాటు సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్యులు పలు సూచనలు చేశారు. ఊహించని విధంగా మహిళలు సైతం అధిక సంఖ్యలో పాల్గొనడంతో వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి గైనకాలజీ ప్రసూతి సంబంధిత సమస్యలను సాధారణ వైద్య సేవలను అందించడం జరిగింది. పేద మధ్య తరగతి కుటుంబాల వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలతో పేద ప్రజలకు వైద్య సదుపాయాలు అందుతాయని పాల్గొన్న వైద్యులు తమ ఆశాభావం వ్యక్తం చేశారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు అన్ని విధాలుగా ఉచిత భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. వైద్యశాల డైరెక్టర్ దండు విద్యాసాగర్ మాట్లాడుతూ పేదలకు సేవలందించడం తమకు సంతృప్తిగా ఉంటుందని తెలిపారు. వై ద్య సిబ్బంది గోన ప్రసాద్ బాబు ఎం ఫిలిప్. తదితరులు పాల్గొన్నారు.

# రాచర్లలో గ్రామ దేవతలకు బోనాల సమర్పణ





**గిద్దలూరు పెన్ పవర్, ఆగస్ట్ 23**

తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వరుణుని కరుణ కటాక్షాల కోసం రాచర్ల గ్రామ ప్రజలు భక్తి శ్రర్ధలతో గ్రామ దేవతలకు ఆదివారం బోనాలు సమర్పించారు. రాచర్ల గ్రామంలో వెలసిన అంకాలమ్మ, రాచర్లమ్మ, గంగమ్మ దేవతామూర్తులను ఆరాధిస్తూ వర్షాలు కురిపించి, పంటల సస్యత ఇవ్వాలని కోరుతూ గ్రామంలోని రైతులు కుంకుమ బండ్లు కట్టి,మహిళలు తలలపై బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి ,ముఌ్వరు గ్రామ దేవతా అమ్మవార్లకు నివేదించారు.

# ఘనంగా బాలాలయ విగ్రహ ప్రతిష్ట



**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 22**

మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో అశేష భక్తజన సందోహం మధ్య పోలేరమ్మ, అంకమ్మ తల్లి బాలాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతిష్టాచార్యులు శివ స్వామి బృందం చే ఈ కార్యక్రమం వేదమంత్రాల సందడి మధ్య కొనసాగింది . . అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన శ్రావణ మాసంలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నందున మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు . గ్రామానికి చెందిన ఆడపడుచులు కూడా స్వగ్రామానికి రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది .గ్రామ దేవతలైన పోలేరమ్మ తల్లి ,అంకమ్మ అమ్మవారి పాత విగ్రహాలకు గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించి, ఆచార వ్యవహారాలతో ప్రతిష్టాపన కొనసాగింది. అమ్మ వారి సేవకు గ్రామస్తులంతా సమిష్టిగా కలిసి రావడంతో గ్రామంలో, గత మూడు రోజుల నుండి ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం కొనసాగింది.



# షాదీ ఖానా నిర్మాణాన్ని పూర్తి చేయాలి

## వైసీపీ మైనార్టీ అధికారప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 23**

కూటమి ప్రభుత్వం పట్టణంలోని షాదీ ఖానా నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయకపోతే ప్రజలతో కలిసి ఉద్యమం చేపడతామని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాన్ని వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ హెచ్చరించారు . ఆదివారం ఆయన నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసిపి హయాంలో ఈ షాదీఖానా నిర్మాణ పనులు వేగమందుకున్న చివరి నిమిషంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయని ఆయన గుర్తు చేశాడు. మళ్లీ వైసీపీ సర్కార్ వచ్చి ఉంటే షాది ఖానా నిర్మాణం పూర్తయి ప్రజలకు ఇప్పటికే అందుబాటులోకి వచ్చేదని ఆయన గుర్తు చేశారు. కానీ దురదృష్టవశాత్తు రాష్ట్రంలో కూటమి సర్కార్ రావడం రాష్ట్రంలో ఏ ఒక్క హామీ అమలు కాకపోవడం, అందులో భాగంగానే మార్కాపురం పట్టణంలో కూడా షాది ఖానా నిర్మాణ పనులు ఆగిపోవడం జరిగిందన్నారు. తమ హయాంలో షాది ఖానా నిర్మాణ పనులు చేయాలని నాడు కెమెరాలు పట్టుకొని షాదిఖాన చుట్టూ తిరిగిన జనసేన నాయకులు ఇప్పుడు ఏమయ్యారని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు కూటమి సర్కార్ పాలిస్తోందని షాది ఖానా నిర్మాణ పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయారని జనసేన నేతలకు టిడిపి నేతలను ఆయన నిలదీశారు. ఇచ్చిన హామీ అమలు



చేయకపోవడంపై మార్కాపురం పట్టణ ప్రజలకు జనసేన నేతలు,టిడిపి నేతలు క్షమాపణ కోరి వెంటనే ఈ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మార్కాపురం పట్టణ ప్రజలతో కలిసి ఉద్యమం చేస్తామని, ఆయన హెచ్చరించారు. షాది ఖానా నిర్మాణ విషయంలో కూటమి సర్కార్ తీరు మారకపోతే మార్కాపురం పట్టణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆపై వచ్చే వైసీపీ సర్కార్ ఈ నిర్మాణ పనులు వెంటనే చేపట్టి షాది ఖానా ను ప్రజలకు అందుబాటులోకి తెస్తుందని ఆయన పేర్కొన్నారు.

# గిద్దలూరులో సర్ -2026 ప్రత్యేక ప్రచార పోలింగ్ కేంద్రాలను అధికారుల తనిఖీలు



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 23**

గిద్దలూరు పట్టణంలో ఓటర్ల జాబితా సవరణ కోసం ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్-2026 ప్రత్యేక ప్రచార దినాల్లో భాగంగా సహాయ ఎన్నికల అధికారి రమణ బాబు పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ సునీత ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం కొత్త ఓటర్ల దరఖాస్తులను స్వీకరించడంతో పాటు, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన దరఖాస్తులను కూడా సరైన ఆధారాలతో స్వీకరించాలని తెలిపారు. ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందుబాటులో ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. ఓటర్లు తమ పేర్లు, వివరాలను పరిశీలించుకోవడంతో పాటు క్లెయిమ్స్, అభ్యంతరాలు, సవరణలకు సంబంధించిన దరఖాస్తులను బీఎల్వోలకు సమర్పించవచ్చని తెలిపారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదు, ఫారం-7 ద్వారా పేర్ల తొలగింపు, ఫారం-8 ద్వారా ఓటరు వివరాల సవరణ, చిరునామా మార్పు లేదా షిఫ్టింగ్‌కు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత బీఎల్వోలపై ఉందని అధికారులు సూచించారు. జాబితాలో ఉన్న తప్పులను సరిచేయడంతో పాటు అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించే ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా 18సంవత్సరాలు నిండిన అర్హులైన యువత ఓటర్లుగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే వ్యక్తికి ఒకే చోట రెండు ఓట్లు ఉన్నట్లయితే నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని, తప్పుడు వివరాలతో దరఖాస్తులు చేయరాదని ఎన్నికల నియమాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ప్రత్యేక ప్రచార దినాలు ముగిసిన తర్వాత కూడా దరఖాస్తు ఫారాలు స్వీకరించే అవకాశం ఉంటుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అవసరమైతే నేరుగా మున్సిపల్ కమిషనర్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు.

# బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వ కృషి అభినందనీయం

## షేక్ నాయబ్ రసూల్ (బడే)

**సి.ఎస్.పురం,పెన్ పవర్ ఆగస్టు 23**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని మండల టీడీపీ సీనియర్ నాయకులు షేక్ నాయబ్ రసూల్ (బడే) హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో బీసీలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు లభించడంతో పాటు స్థానిక పాలనలో ప్రాతినిధ్యం పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. బీసీలకు కేవలం సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించడమే కాకుండా రాజకీయంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించడం స్వాగతించదగ్గ పరిణామమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం వల్ల గ్రామస్థాయి నుంచి బీసీ నాయకత్వం మరింత బలోపేతం అవుతుందని,ప్రజా జీవితంలో బీసీలు మరింత చురుగ్గా భాగస్వాములు కావడానికి దోహదపడుతుందని అన్నారు. రిజర్వేషన్ల వల్ల ఎంతోమంది బీసీ యువత, నాయకులకు స్థానిక సంస్థల ద్వారా



రాజకీయాల్లోకి వచ్చే అవకాశం లభిస్తుందన్నారు బీసీలకు రిజర్వేషన్లకు మద్దతుగా అసెంబ్లీలో నిర్ణయం తీసుకోవడంలో సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి ఎమ్మెల్యేలకు మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

# గిద్దలూరులో శ్రీకన్యకాపారమేశ్వరి దేవస్థానం హద్దు సభ్యుల ఎన్నికలు



ఓటు హక్కు వినియోగించుకున్న ప్రధాన ఎన్నికల అధికారి శివపురం వెంకట నాగేంద్రబాబు.



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 23**

గిద్దలూరు పట్టణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం కమిటీ మెంబర్ల ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు ఆలయ అధ్యక్షుని ఎన్నిక పెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. మొదటి సంవత్సరం కోటా శ్రీనివాసులు రెండవ సంవత్సరం పరుచూరి నాగేశ్వరరావు అధ్యక్షులుగా పదవిని నిర్వహించే విధంగా ఆర్యవైశ్య పెద్దలు నిర్ణయించారు. గిద్దలూరు పట్టణంలో ఒకటి నుండి 15 హద్దులు ఉండగా ఇందులో రెండు హద్దులు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా మిగిలిన 13 హద్దులకు ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఎన్నికలకు ప్రముఖ న్యాయవాది శివాపురం వెంకట నాగేంద్రబాబు ఎన్నికల అధికారిగా పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. హద్దుల నెంబర్లుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు వయోవృద్ధులను వికలాంగులను సైతం సాధారణ ఎన్నికల మాదిరి పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకుని వచ్చి ఓటు హక్కు వినియోగించేలా కృషి చేస్తున్నారు . సార్వత్రిక ఎన్నికలను మించి ఈ ఎన్నికలు జరుగుతున్నాయి.

# చదువుతోనే క్రమ శిక్షణ సాధ్యం





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 23**

ప్రతి ఆదివారం గిద్దలూరు శాఖా గ్రంథాల యంలో బాల బాలికలకు చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా తెలుగులో చదువు గొప్పతనం గురించి చక్కగా చదివి విజేతలైన వారికి శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి ఆలయం మాజీ చైర్మన్ శివావపురం ఆంజనేయులు సహకారంతో బహు మతులు అందజేశారు ఈ సందర్భంగా శివపురం మాట్లాడుతూ విద్యార్థులు జన్మ నిచ్చిన తల్లిదండ్రుల ఆశయాలకు అను గుణంగా లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ప్రసన్నకుమారి విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ముసల్ రెడ్డి వాసవి జాగృతి మిత్ర మండలి క్లబ్ అధ్యక్షులు వంశీ కృష్ణ యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు సయ్యద్ ఫరూఖ్ పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన సిఐ, ఎస్ఐ

**సి.ఎస్.పురం, పెన్ పవర్ ఆగస్టు 23**

మండలంలోని నల్లమడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం సిఐ వినోద్ కుమార్, ఎస్సై వెంకటేశ్వరరెడ్డి పరిశీలించారు. అనంతరం సీఐ, ఎస్సై గ్రామస్తులతో మాట్లాడి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు గుర్రం వెంకటేశ్వర్లు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ధీశాలి ఆంధ్రకేసరి టంగుటూరి

**– నగరంలో ఘనంగా ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు టంగుటూరి ప్రకాశం పంతులు 154 వ జయంతి వేడుకలు**









**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 23**

ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్య మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెల్ల దొరల గుండుకు గుండె ను చూపించిన ధీశాలి టంగుటూరి ప్రకాశం పంతులు అని పలువురు వక్తలు ప్రకాశం పంతులు సేవలను స్మరించుకున్నారు. ఆదివారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154 వ జయంతి సందర్భంగా నగరంలో పలుప్రాంతాల్లో ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**జిల్లా పోలీస్ కార్యాలయంలో...**

స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి బిరుదాంకితుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి. నాగేశ్వరరావు, పోలీస్ అధికారులు టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీతారా మరెడ్డి, ఆర్ఎస్సైలు, ఏఆర్ ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో..**

త్యాగాలకు, దానధర్మాలకు, దేశభక్తికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని, స్వాతంత్ర్య సమరంలో బ్రిటిష్ పాలకులను ఎదిరించి, భారత స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ధన్యజీవి అని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు పేర్కొన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు గారి 155వ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో లాయర్‌పేట రైతుబజార్ కూడలి ప్రకాశం పంతులు విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీ దామచర్ల జనార్ధన్ రావు హాజరై ప్రకాశం పంతులు గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రాహ్మణ సేవా సమితి కమ్యూనిటీ హాల్లో బ్రాహ్మణ సేవా సమితి సభ్యులతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కామరాజు గడ్డ కాశి బాబు, శ్రీకాళహస్తి దేవాలయ సభ్యురాలు కుసుమకుమారి, మద్దులూరి ప్రేమ్ హరినాథ్, ఆదిపూడి వెంకట గిరిజా శాండిల్య, గంజాం రంగనాథ్ ప్రసాద్, మైనంపాటి సాయికుమార్, కొండపాటూరి అప్పాజీ, వంశీ, మారుతి, అద్దంకి రంగారావు, అద్దంకి భువనేశ్వర్,పరమాత్మ నాగేశ్వరరావు, పి నరసింహారావు, కొండేపి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా కేంద్ర గ్రంథాలయంలో**

ఒంగోలు నందు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154 వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు, కవి, వ్యక్తిత్వ వికాసకులు జాలాది మోహన్, ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, సిబ్బంది యం. శ్రీనివాసులు, డి.సందీప్, యం. శివ కుమారి, యస్. అనిల్ బాబు, విద్యార్థిని, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## తెలుగువారి తెగువకు నిలువెత్తు నిదర్శనం ఆంధ్రకేసరి

**నివాళులర్పించిన వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ డాక్టర్ దద్దాల**



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 23**

తెలుగువారి తెగువకు నిలువెత్తు నిదర్శనం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ కొనియాడారు.ఆదివారం టంగుటూరి ప్రకాశం పంతులు 155 వ జయంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన చూపిన తెగువ చిరస్మరణీయమన్నారు.ఆయన ధైర్యసాహసాలకు, ఆత్మగౌరవానికి మరియు నిజాయితీకి ప్రతీకగా నిలిచారన్నారు.బ్రిటిష్ తుపాకుల ఎదుట గుండెను అడ్డుపెట్టి సాహసం ప్రదర్శించిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు.తెలుగువారిలో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చిన ధీరోదాత్తుడు, త్యాగధనుడన్నారు.ఆంధ్ర రాష్ట్ర తొలి మఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రగతికి బాటలు వేసిన ప్రకాశం పంతులు అకుంఠిత దేశ భక్తుడని,ఆయన జయంతి సందర్భంగా ఆ మహనీయుని త్యాగాలను, నిస్వార్థ సేవలను స్మరించుకుందామని దద్దాల నారాయణ యాదవ్ అన్నారు ఈ కార్యక్రమం లో పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ పార్టీ ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ విభాగాల సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## భావితరాలకు స్ఫూర్తినివ్వాలి

**– ప్రకాశం పంతులు జీవిత ఘట్టాలు ఫోటో ప్రదర్శన పై జిల్లా ఎస్పీ, ఒంగోలు ఎమ్మెల్యే**



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 23**

భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ధన,మాన ప్రాణాలను త్యజించిన మహనీయుల జీవిత చరిత్రా లను స్ఫూర్తినిచ్చేలా విద్యార్థులలో అవగాహన పెంచేందుకు ఇలాంటి ఫోటో ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు మండలం దేవరంపాడు లోని ఉప్పు సత్యాగ్రహ శిబిరం వద్ద ఏర్పాటుచేసిన టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత ఫోటో ప్రదర్శనలు తిలకించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఒంగోలు మండలం దేవరంపాడు లోని ఉప్పు సత్యాగ్రహ శిబిరం వద్ద ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 155వ జయంతోత్సవాల సందర్భంగా కరవది వివేకానంద విద్యా విహార్ విద్యార్థిని విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ప్రేక్షకులను ఆసక్తిగా గమనించేటట్లు చేసింది ఆయన పుట్టిన నాటి నుండి అంతిమయాత్ర వరకు 150 ఫోటోలతో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి పాల్గొన్నారు. ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేసిన నిర్వాహకులు వివేకానంద విద్యా విహార హెచ్ఎం ఏం రమాదేవిని ఎస్పీ,ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

## శ్రీ వాసవి కన్యాకపరమేశ్వరి ఆర్య వైశ్య సంఘం ఎన్నికలో కోటాశ్రీను ప్యానల్ ఘన విజయం

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 23**

గిద్దలూరు శ్రీ వాసవి కన్యకాపారమేశ్వరి ఆర్య వైశ్య సంఘం హద్దు సభ్యుల ఎన్నికలు ఉత్కంఠ భరితంగా సాగాయి. అధ్యక్ష ఎన్నిక అత్యంత ఉత్కంఠ భరితంగా ఉండటంతో ఆర్య వైశ్య పెద్దలు గమనించి సంఘం గ్రూపులుగా విడి పోకుండా సంఘటితంగా ఉండే విధంగా అమ్మవారి సమక్షంలో రాజీ గా చీటీలు వేసి మొదటి సంవత్సరం కోటా శ్రీనివాసులు రెండో సంవత్సరం పరుచూరి నాగేశ్వర రావు లను అధ్యక్ష పదవి నిర్వహించే విధంగా చేశారు . కానీ హద్దు సబ్యులకు ఎన్నిక ఆదివారం నిర్వహిచారు ఈఎన్నికలు కూడా సార్వత్రిక ఎన్నికలను తల్పించాయి ఇరువురు తమ ప్యానల్ ను ఏర్పాటు చేసి ఎన్నికల బరిలో కి దింపారు. అయితే ఈ ఎన్నికలో మొదటి అధ్యక్షులు నియమితులైన కోటాశ్రీనివాసులు ప్యానల్ సభ్యులు అధిక హోదుల్లో విజయం సాధించి విజయ కేతనం ఎగురవేశారు. దీంతో కోటా శ్రీనివాసులు శిబిరం లో ఆనందోత్సవాలో మునిగిపోయారు ఈ హద్దు ఎన్నికలు ఉత్కంఠ భరితంగా కావటంతో భారీ పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశారు. ఓటు హక్కును వినియోగించుకుని లబ్ది పొందేందుకు ప్యానల్ పెద్దలు మంచంపై ఉన్నవారిని సైతం పోలింగ్ కేంద్రానికి తీసుకు వచ్చారు. గిద్దలూరు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం కమిటీ ఎన్నికల్లో కోటా శ్రీనివాసులు వర్గానికి చెందిన 22 మంది అభ్యర్థులు విజయం సాధించారు అలాగే త్వరలో ఆలయ కమిటీ అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేయనున్న కోట శ్రీనివాసులు ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులుఅందరికీ శుభాకాంక్షలు తెలిపారు.



## ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం స్ఫూర్తితో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం

**– రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి**







**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 23**

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయ స్ఫూర్తితో జిల్లాను, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. ప్రకాశం పంతులు 155వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రకాశం భవనంలోని ఆయన విగ్రహానికి మంత్రితో పాటు కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన రావు,బి.ఎన్. విజయ్ కుమార్, రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఇతర ప్రముఖులు కలిసి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. 'ఆంధ్ర కేసరి' జీవిత చరిత్రను తెలిపేలా ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను వారు తిలకించారు. అనంతరం ప్రకాశం పంతులు ముని మనవడు టంగుటూరి సంతోష్ కుమార్ ను వారు శాలువాతో సన్మానించి గౌరవించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉన్నత విద్యావంతునిగా, స్వాతంత్ర్య పోరాట యోధునిగా, ధైర్యశాలిగా, గొప్ప పరిపాలనాధికారిగా ప్రకాశం పంతులు చూపిన మార్గం అనుసరణీయమన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని మంత్రి పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతికూల పరిస్థితులను అధిగమించి జీవిత ఆశయాన్ని చేరుకోవటంలో ప్రకాశం పంతులు మన అందరికీ దర్శనీయమన్నారు. విద్యార్థి దశలోనూ, స్వాతంత్ర్య పోరాట సమయంలోనూ, ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించడంలోనూ ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్ఫూర్తితో అభివృద్ధి పనులను వేగవంతం వేసామన్నారు. దేవరంపాడులో ఉప్పు సత్యాగ్రహ విజయ స్తూపం, పార్కును అభివృద్ధి చేశామన్నారు. ప్రకాశం పంతులు గొప్ప వ్యక్తి అని, అందుకే ఆయన పేరు ఈ జిల్లాకు పెట్టినట్లు గుర్తు చేశారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే, సంఘ సంస్కరణల కోసం కూడా కృషి చేశారని చెప్పారు. ధైర్యానికి, త్యాగనిరతికి ప్రతీకగా నిలిచిన మహనీయుని అడుగుజాడల్లో మనమందరము నడవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పి.వి. రమణ, ఒంగోలు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఆగస్టు 31న వెలుగొండకు పది టీఎంసీలు నీరు సరఫరా

**– వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ పరిహారం చెల్లిస్తాం**

**– రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి వెల్లడి**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 23**



వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ పరిహారం అందిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలా వీరాంజనేయస్వామి స్వామి స్పష్టం చేశారు. ఆదివారం ప్రకాశం భవనంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 31వ తేదీన 10 టీఎంసీల నీళ్లు వెలుగొండకు ఇస్తామన్నారు. ఆగస్టు నెలాఖరులోగా నీళ్లు ఇస్తామని చెప్పిన మాట ప్రకారం తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో నిర్వాసితులందరికీ పరిహారం అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని, అసత్యాలను నమ్మవద్దని మంత్రి చెప్పారు. 1996 మార్చి 5వ తేదీన నాటి ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. సరిగ్గా 30 ఏళ్ల తర్వాత మళ్లీ చంద్రబాబు నాయుడే ఈ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి నీళ్లు విడుదల చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. ఇది గొప్ప అదృష్టమని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాములో నిర్లక్ష్యానికి గురైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు మరమ్మతులు చేశామన్నారు. మరోవైపు నిర్వాసితులకు రూ.900 కోట్లకుగాను ముఖ్యమంత్రి చేతుల మీదగా ఇప్పటివరకు రూ.768 కోట్లను మూడు విడతలుగా అందించామన్నారు. మిగతా వారికి కూడా పరిహారం ఇస్తామని మంత్రి స్వామి స్పష్టం చేశారు. అపర భగీరథునిలాగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న నదుల అనుసంధానం వంటి అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులందరికీ అందాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలందరూ సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు.

## గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించండి

**ఎంపీపీ, జెడ్పీటీసీలకు ఘనంగా సన్మానం**

**ఎంపీపీ మౌనిక,జెడ్పీటీసీ భారతి సేవలు మరువలేనివి -ఎంపీటీసీ చింతలపూడి**





**వలేటివారిపాలెం, ఆగస్టు 23:**

గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ పొనుగోటి మౌనిక, జెడ్పీటీసీ ఇంటూరి భారతి అన్నారు . స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశం ఆసక్తికరంగా సాగింది. ముందుగా టంగుటూరు ప్రకాశం పంతులు పుట్టినరోజు సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఎంపీపీ మౌనిక అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంపీడీఓ, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. **సమస్యలపై నిలదీత:** సమావేశం ప్రారంభం కాగానే గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని, ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని కోరారు.పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ మౌనిక అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. **ఎంపీపీ, జెడ్పీటీసీ లకు ఘన సన్మానం:** అనంతరం మండల అభివృద్ధికి కృషి చేసిన ఎంపీపీ, జెడ్పీటీసీలను ఎంపీటీసీ సభ్యులు చింతలపూడి రవీంద్ర, చౌడబోయిన యానాది ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించి, పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ చింతలపూడి మాట్లాడుతూ "ఎంపీపీ, జెడ్పీటీసీ చేసిన సేవలు మరువలేనివి. గ్రామాల అభివృద్ధికి వారు చేసిన కృషి ఎనలేనిది" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వై శంకరరావు, పశువైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ చెన్నకేశవులు, పోకూరు పశువైద్యాధికారి సుధాకర్, ఏపీఓ దయాసాగర్, ఏపిఎం రాచర్ల, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 23**

విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా సోమవారం నాడు భాగ్యనగర్ 2, 3 వ లైన్ లోని పరిసర ప్రాంతంలో ఉదయం 06.30 గం. నుండి 08.30 గం. వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డి.ఈ.ఈ కె.వి. పాండురంగా రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# నిఘా నీడల్లో పుల్లలచెరువు పీఎం శ్రీ పాఠశాల...

## తరగతి గదులపై నిరంతర పర్యవేక్షణ.. -విద్యార్థుల ప్రవర్తనపై ప్రత్యేక నిఘా





**పుల్లల చెరువు పెన్ పవర్ ఆగస్ట్ 23**

కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో నాణ్యతా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్య, క్రమశిక్షణతో కూడిన వాతావరణం కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది.ఇందులో భాగంగా పుల్లలచెరువులోని పీఎం శ్రీ పాఠశాలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ తరగతి గదులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.పాఠశాలలో ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థ ద్వారా తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సక్రమంగా పాఠాలు బోధిస్తున్నారా? విద్యార్థులు పాఠాలపై శ్రద్ధ చూపుతున్నారా? తరగతి గదుల్లో అల్లరి, క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడుతున్నారా? వంటి అంశాలను ప్రధాన ఉపాధ్యాయులు తమ కార్యాలయంలో నుంచే ఎప్పటికప్పుడు పరిశీలించే అవకాశం ఏర్పడింది.గతంలో తరగతి గదుల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలంటే ప్రధానోపాధ్యాయులు స్వయంగా ప్రతి తరగతి గదిని సందర్శించాల్సి వచ్చేది.ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో కార్యాలయంలో నుంచే తరగతి గదుల పరిస్థితిని పర్యవేక్షించే అవకాశం కలిగింది. దీంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరగడంతో పాటు ఉపాధ్యాయులు కూడా బోధనపై మరింత శ్రద్ధ వహించే పరిస్థితి ఏర్పడిందని పాఠశాల వర్గాలు పేర్కొంటున్నాయి.పాఠశాలలో ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థ విద్యార్థులను భయపెట్టడానికి కాకుండా వారిలో క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తన పెంపొందించేందుకు ఉపయోగపడుతుందని ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ తెలిపారు.విద్యార్థులు తరగతి గదుల్లో అల్లరి చేయకుండా చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేలా ఈ విధానం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించే విధానం, విద్యార్థుల స్పందన, పాఠశాల పరిసరాల్లో క్రమశిక్షణ వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.పీఎం శ్రీ పాఠశాలల ప్రధాన లక్ష్యాల్లో ఒకటైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యా రంగంలో సమర్థవంతంగా వినియోగించడంలో భాగంగానే ఈ చర్యలు చేపడుతున్నట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి.సాంకేతికతను విద్యా బోధనతో అనుసంధానం చేయడం వల్ల విద్యార్థులకు సురక్షితమైన, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం అందించవచ్చని పేర్కొంటున్నారు.పాఠశాలలో నిఘా వ్యవస్థతో పాటు విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని మెరుగుపర్చడం, క్రమశిక్షణను పెంపొందించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తే పీఎం శ్రీ పాఠశాల మరింత ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉందని విద్యాభిమానులు అభిప్రాయపడుతున్నారు.నిఘా వ్యవస్థతో పర్యవేక్షణ.. ఉపాధ్యాయుల బాధ్యతాయుత బోధన.. విద్యార్థుల క్రమశిక్షణ.. వెరసి పుల్లలచెరువు పీఎం శ్రీ పాఠశాలలో విద్యా వాతావరణాన్ని మరింత పటిష్టం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి.

## వెంకయ్య స్వామి బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయం - ఐ మురళీకృష్ణ

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 23**



కలియుగ వరదుడు దత్తాత్రేయుడు కలియుగములో భక్త జనులను ఉద్ధరించుట కొరకు సాక్షాత్తు త్రిమూర్తి స్వరూపంగా దత్తాత్రేయ స్వామి అవతరణ జరిగినదని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ఐ. మురళీకృష్ణ తెలిపారు. స్థానిక సంతపేట లో వేంచేసి ఉన్న భగవాన్ శ్రీశ్రీశ్రీ గొలగమూడి వెంకయ్య స్వామి వారి 44వ ఆరాధన మహోత్సవాల భాగంగా ఏర్పాటు చేసిన దత్త సాంప్రదాయం అనే అంశంపై ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ఉపన్యాసము లో ఆయన మాట్లాడుతూ కలియుగము లో సమస్త మానవాళి ఆధ్యాత్మిక ఉద్ధరణ నిమిత్తం లోక కళ్యాణం కోసం మహా పతివ్రత అనసూయ అత్రి మహాముని కుమారునిగా దత్తాత్రేయ స్వామి అవతరించడం జరిగిందని పేర్కొన్నారు. వేద స్వరూపమైన ఉపనీషత్తులలో 108వది అయిన ముక్తి కోపనిషత్తు, సన్యాసపనిషత్తులలో దత్త సంప్రదాయానికి చెందిన అవధూతల జీవిత రహస్యాలకు సంబంధించిన పలు అంశములు మనకు లభ్యం అవుతున్నాయని సోదాహరణముగా వివరించారు. జగత్ కళ్యాణం కోసం అవతరించిన భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి బోధనలు లీలలు సర్వ మానవాళి ఆధ్యాత్మిక ఉన్నతికి మార్గదర్శకాలని పేర్కొన్నారు. తదనంతరం మందిర నిర్వాహకులు ఆవుల ఆంజనేయులు, సభ్యులు ప్రవచకులు మురళీకృష్ణ ను ఘనంగా సత్కరించారు. తదనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగినది. నేటి కార్యక్రమాల్లో భాగంగా శ్రీ స్వామివారికి ఉదయం అభిషేకం విశేష దుని పూజ ప్రత్యేక హారతి విశేష అన్నదాన సంతర్పణ కార్యక్రమం సాయంత్రం శ్రీ పర్వత రావు చే ఆధ్యాత్మిక ఉపన్యాసం జరుగుతాయని కావున భక్తులు పై కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు తెలిపారు.

## మదవవాగు బ్రిడ్జి పై కూలిపోయిన ఆర్ అండ్ బి రక్షణ గోడలు

**ప్రమాదాలు జరుగుతున్నా, పట్టించుకోని ఆర్ ఎం బి శాఖ అధికారులు.**

**ప్రమాదాలను తలుచుకుంటూ ఆందోళన చెందుతున్న వాహనదారులు, ప్రయాణికులు.**



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 23.**

ఆర్ అండ్ బి రోడ్డుపై బ్రిడ్జికి ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు కూలిపోవడంతో ప్రమాదలకు గురవుతూ వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కడప- అమరావతి జాతీయ రహదారిలో కొమరోలు మండలం గోనెపల్లి బస్ స్టేజి సమీపంలో మధవ వాగు పై గతంలో బ్రిడ్జి నిర్మించి, ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేశారు. అయితే కాలానుగుణంగా రక్షణ గోడలకు కాలం చెల్లడంతో అవి కూలి పోవడం ప్రారంభించాయి. ఆ క్రమంలో బ్రిడ్జిపై ఇరువైపుల నిర్మించిన రక్షణ గోడలు గత ఐదు ఏళ్ల క్రితం పూర్తిగా కూలిపోయాయి. దీనితో ఆ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనాలు ఆటోలు తదితర చిన్న వాహనాలు అదుపుతప్పి దాదాపు 10-15 అడుగుల లోతులో ఉన్న వాగులో పడుతూ, ప్రమాదాలకు గురవుతున్నాయని గతంలో ఇలాంటి ప్రమాదాలు అనేకం జరిగాయని ఆ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు, ప్రయాణికులు చెబుతున్నారు. బ్రిడ్జిపై రోడ్డు కూడా గుంతల మయం కావడంతో వాహనాలు అదపు తప్పుతున్నాయని అయితే ఇటీవల ఆర్ అండ్ బి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పోలీసుల చొరవతో తాత్కాలికంగా పూడిపించి కొంతమేర సౌకర్యం కల్పించారని వాహనదారులు చెబుతున్నారు. బ్రిడ్జిపై నిర్మించిన రక్షణ గోడలు కూలిపోయి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, వాటిని తిరిగి నిర్మించేందుకు ఆర్ అండ్ బి శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకొకపోవడం పట్ల వాహనదారులు ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందుతూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. సదరు రోడ్డుపై నిత్యం బస్సులు,లారీలు, కార్లు ఆటోలు,ద్విచక్ర వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్ అండ్ బి శాఖ అధికారులు చర్యలు తీసుకొని మదవ వాగు పై నిర్మించిన బ్రిడ్జిపై ఇరువైపులా కూలిపోయిన రక్షణ గోడలను త్వరితిన నిర్మించి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

## ఒంగోలు ప్రత్యేకతను చాటి చెప్పేలా.. 28 న మంత్రి లోకేష్ చేతుల మీదుగా

**పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలకు శ్రీకారం**

**ఏర్పాట్లు.. స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్**





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 23**

ఒంగోలు నగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను వేగవంతం చేయడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఒంగోలు మునిసిపాలిటీ ఏర్పడి 150 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో నగర సుందరీకరణ, భవిష్యత్తు అవసరాలు తీర్చేలా మౌలిక వసతులు, అభివృద్ధి పనులను చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు ఆదివారం నగరంలో విస్తృతంగా పర్యటించారు.కిమ్స్ ఆసుపత్రి ఫ్లైఓవర్ వద్ద జోడు ఎద్దుల విగ్రహాలు, పీ.వీ.ఆర్. బాలుర ఉన్నత పాఠశాల వద్ద ప్రత్యేక శిలాఫలకం, గాంధీ పార్కులో ఓపెన్ ఎయిర్ థియేటర్, ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.14 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శిలాఫలకం ఆవిష్కరణ, పీడీసీసీ బ్యాంకులో చేపట్టిన ఆధునీకరణ పనుల ప్రారంభోత్సవం, మినీ స్టేడియంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ వంటి కార్యక్రమాలను ఈ వారంలో చేపట్టడంపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. అవకాశముంటే ఈనెల 28వ తేదీన ఒంగోలు పర్యటనకు విచ్చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఈ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ పర్యటనలో ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, మునిసిపల్ ఇంజనీర్ యేసయ్య, డీ.ఈ.ఈ. పద్మజ, విశ్రాంత మునిసిపల్ కమిషనర్ సంకురాతి వెంకట కృష్ణ, ఇతర అధికారులు ఉన్నారు.

## 28న ఉద్యమ శంఖారావం” రాష్ట్ర సదస్సు

**- విజయవంతం చేయాలి - ఏపీ జెఎసి అమరావతి ప్రకాశం జిల్లా చైర్మన్ పిన్నిక మధుసూదన్ రావు పిలుపు**





**ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్, పెన్ పవర్ ఆగస్టు 23**

ఈనెల 28వ తేదీ న విజయవాడలో నిర్వహించనున్న “ఉద్యమ శంఖారావం” రాష్ట్ర సదస్సుకు ప్రకాశం జిల్లా నుండి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ జెఎసి అమరావతి ప్రకాశం జిల్లా చైర్మన్ పిన్నిక మధుసూదన్ రావు పిలుపునిచ్చారు. ఆదివారం ఏపీ జెఎసి అమరావతి ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అనుబంధ సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల హక్కులు, సమస్యలు, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యమ బాట పట్టాల్సిన అవసరం ఏర్పడిందని నాయకులు తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి విభాగంలోని ఉద్యోగులకు వివరించి, ఉద్యమానికి ఉద్యోగులందరినీ సమాయత్తం చేయాలని సూచించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించడం ద్వారానే మన హక్కులను సాధించుకోగలమని, అందువలన ప్రతి ఉద్యోగి 28న విజయవాడలో జరిగే “ఉద్యమ శంఖారావం” రాష్ట్ర సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. అలాగే, జిల్లా ఏపీ జెఎసి అమరావతి కార్యవర్గ సభ్యుల తీర్మానం మేరకు తాత్కాలిక ఏపీ జెఎసి అమరావతి ప్రకాశం జిల్లా చైర్మన్‌గా టంగుటూరు మండల తహసీల్దార్ ఆంజనేయులుని నియమించినట్లు ప్రకటించారు. ఈ సమావేశానికి , ఆంజనేయులు, ఉతకోలు శ్రీనివాసరావు, పోలయ్య, రాజు, వెంకటేశ్వరరెడ్డి, రాయుడు, నాల్గవ తరగతి ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు కొమాటిగుంట వెంకటేశ్వర్లు, యోబు, ఎం. శ్రీనివాసులు, మహిళా విభాగం నుండి శ్రీదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు.. -ఒకరికి తీవ్ర గాయాలు

**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 23**



అద్దంకి నార్కట్పల్లి రాష్ట్రీయ రహదారిపై మండలంలోని వైదన సమీపంలో ఆదివారం ఉదయం ఆంజనేయ డైరీ వద్ద ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుండి కారు ఢీకొన్న ప్రమాదంలో బల్లికురవకు చెందిన కందుల ఎలీషా తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం ఉదయం కూకట్లపల్లి గ్రామంలోని బంధువుల ఇంటి వద్దకు వెళ్లేందుకు ఎలీషా బయలుదేరాడు. ఈ క్రమంలో కారు ఢీకొనటం, కొంత దూరం ద్విచక్ర వాహనాన్ని ఈడ్చుకుంటూ వెళ్ళటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సమయంలోనే కొప్పెరపాడు గ్రామానికి మండల వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దమ్ము అంజయ్య తన మిత్ర బృందం మస్తాన్వలి తన్నీరు శ్రీను , గోపికృష్ణ ,, తన్నీరు గోపి లతో వైదన పెట్రోల్ బంక్ వద్దకు వెళుతూ ప్రమాదాన్ని గుర్తించి ఆగిపోయారు . ప్రమాదానికి కారణమైన కారును కొంత దూరం వెంబడించిన ఫలితం లేకుండా పోయింది. సత్వరం సంఘటన స్థలానికి చేరుకొని 108 వాహనానికి సమాచారం అందించారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు.

**సత్వరం స్పందించిన మంత్రి వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాసరావు**

అంజయ్య ఫోన్ సమాచారంతో సంఘటన స్థలానికి 108 వాహనం తో పాటు, నాం హైవే అంబులెన్స్ కూడా వచ్చింది. ఎలీషాకు కాలు విరగటం, తలకు బలమైన కావటంతో క్షతగాత్రుడిని నరసరావుపేట వైద్యశాలకు తరలించాలని కుటుంబ సభ్యులు కోరారు. రెండు అంబులెన్స్ వాహనాల సిబ్బంది తాము అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు మాత్రమే తరలిస్తామని, నరసరావుపేట తీసుకెళ్లమని మొండికేయడంతో అంజయ్య రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ వ్యక్తిగత సహాయకుడు కుక్క పల్లి శ్రీనివాసరావును ఫోన్లో సంప్రదించి ప్రమాద విషయం తెలియజేయడంతో పాటు, 108 సిబ్బంది రామాంజనేయులతో మాట్లాడించారు. ఈలోపు అర్ధగంటకు పైగా సమయం గడిచిపోయింది . శ్రీనివాసరావు ఆదేశాలతో 108 వాహనంలో, ఎలిషాను నరసరావుపేట వైద్యశాలకు తరలించారు . క్షతగాత్రుడి కి ప్రాణాపాయం ఉన్న సమయంలో అయితే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తీవ్ర మూల్యం చెల్లించాల్సి వచ్చేది. అత్యవసర సమయాలలో కార్పొరేట్ వైద్య సేవలు అందజేసే వైద్యశాలల వద్దకు ప్రమాద బాధితులను చేరవేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## స్ఫూర్తిదాయకంగా బాలవిహార్ శిక్షణా తరగతులు

**- శ్రీ గిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్**



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 23**

విద్యార్థులలో చిన్నప్పటి నుంచే దేశ భక్తి దైవభక్తి క్రమశిక్షణ నైతిక విలువలు నియమ నిష్ఠలు సదాచారం సంస్కృతి సంప్రదాయాల పట్ల అనురక్తి పెద్దలను గౌరవించడం సన్మార్గంలో పయనించడం వ్యక్తిత్వ వికాసం కలిగిన వారిగా తీర్చి దిద్దడం వంటి సమున్నత లక్ష్యాలతో సంవత్సరం క్రితం చిన్మయ మిషన్ తోడ్పాటుతో శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రారంభించిన శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులు ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయని శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి దేవస్థానం గో క్షేత్ర భవన్ లో నిర్వహిస్తున్న శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులను శ్రీనివాస చరణ రాజీవ్ శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణితో కలిసి పరిశీలించారు. శ్రీగిరి చిన్మయ బాల విహార్ విద్యార్థులు భగవద్గీతలోని భక్తి యోగం శ్లోకాలను క్షుణ్ణంగా నేర్చుకుని భగవద్గీత కంఠస్థ పోటీలలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తించి చిన్మయ మిషన్ ప్రబోధకులు సత్యాత్మా నంద స్వామిని అభినందించారు. త్వరలో శ్రీ గిరి చిన్మయ బాలవిహార్ విద్యార్థులకు భజన సంకీర్తనలు కూడా నేర్పేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# నేడే వెలుగొండ ప్రారంభోత్సవానికి అంకులంగా భారీ మోటార్ సైకిలు ర్యాలీ

## ఎమ్మెల్యే ముత్తుముల ఆధ్వర్యంలో

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 23**

ఈనెల 30 న వెలిగొండ జలాల విడుదల సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గంలో పండగ వాతావరణంనెలకొంది. సోమవారం ఉదయం గిద్దలూరులో ఎమ్మెల్యే ముత్తుముల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహింస్తున్నారు పశ్చిమ ప్రకాశం మార్కాపురం జిల్లా ప్రజల, రైతాంగపు 30 దశాబ్దాల నాటి కల నెరవేరుతున్న చారిత్రాత్మక ఘట్టం ఆసన్నమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన నాయకత్వంలో వెలిగొండ ప్రాజెక్టు పనులను ఎన్నడూ లేని విధంగా వేగవంతం చేశారు. నాడు ఇదే వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన నారా చంద్రబాబు నాయుడు , మళ్లీ ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ఈనెల 30 వ తేదీన వెలిగొండ జలాలను జాతికి అంకితం చేస్తూ విడుదల చేయనుండటం ఎంతో శుభపరిణామం. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వెలిగొండ నిర్వాసితుల కష్టాలను గుర్తించి, వారికి తగిన నష్టపరిహారాన్ని అందజేసి ఆదుకున్న ఘనత కూడా కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తుముల పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని, వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కరువు ప్రాంతాలైన మన ప్రాంతానికి సాగునీరు, తాగునీరు అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి , ముఖ్యమంత్రి కి కృతజ్ఞతా భావంతో గిద్దలూరు నియోజకవర్గంలో విశేష వేడుకలు నిర్వహించతలపెట్టామన్నారు. శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో రేపటి నుండి మూడు రోజుల పాటు గిద్దలూరు నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రముఖ దేవాలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరగనున్నాయి.ఆగస్టు 24 న సోమవారం ఉదయం 9.00 లకు గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి శ్రీ పాతాళ నాగేశ్వరస్వామి వారి ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ శుభసందర్భంలో కూటమి భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, నాయకత్వాలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, రైతులు మ నియోజకవర్గ ప్రజలందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి, ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలలో భాగస్వాములై విజయవంతం చేయాల్సిందిగా కోరారు.



# శ్రీలంకపై పడిక్కల్ హవా.. వరుసగా రెండో టెస్టులోనూ సెంచరీ

- శ్రీలంకతో రెండో టెస్టులోనూ సెంచరీ చేసిన దేవదత్ పడిక్కల్
- 73 ఓవర్లలో భారత్ స్కోరు 271/3
- అర్ధశతకంతో రాణించిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్
- జడేజాతో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన పడిక్కల్
- తొలి టెస్టులోనూ 167 పరుగులతో భారీ సెంచరీ చేసిన పడిక్కల్



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంకతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో 167 పరుగుల భారీ శతకంతో ఆకట్టుకున్న పడిక్కల్, కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టులోనూ సెంచరీతో కదం తొక్కాడు. అతని అద్భుత ఇన్నింగ్స్ సాయంతో, తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు పటిష్ఠ స్థితిలో నిలిచింది.కొలంబోలోని సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో నేడు ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఓపెనర్లుగా బరిలోకి దిగిన యశస్వి జైస్వాల్ (45), కేఎల్ రాహుల్ (18) మోస్తరు స్కోర్లు సాధించారు. జైస్వాల్ దూకుడుగా ఆడినా, భారీ స్కోరు చేయలేకపోయాడు. రాహుల్ మరోసారి నిరాశపరిచాడు. కేవలం 66 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును పడిక్కల్ ఆదుకున్నాడు.కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి పడిక్కల్ కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 120 పరుగులు జోడించారు. ఈ క్రమంలో గిల్ (50) బాధ్యతాయుతమైన అర్ధశతకం పూర్తి చేసుకోగా, పడిక్కల్ తన క్లాస్ బ్యాటింగ్‌తో అలరించాడు. గిల్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (3) గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. అనంతరం రవీంద్ర జడేజాతో కలిసి పడిక్కల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు.

ప్రస్తుతం పడిక్కల్ 185 బంతుల్లో 12 ఫోర్లతో 111 పరుగులు, జడేజా 45 బంతుల్లో 31 పరుగులతో క్రీజులో ఉన్నారు. వీరిద్దరూ అప్పటికే అజేయంగా 64 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. భారత్ 73 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసి భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. శ్రీలంక బౌలర్లలో అసిత్ ఫెర్నాండో రెండు వికెట్లు తీయగా, లహిరు కుమార ఒక వికెట్ పడగొట్టాడు.

# భారత్-శ్రీలంక టెస్టులో ఉద్రిక్తత.. బౌలర్‌పైకి దూసుకెళ్లిన యశస్వి జైస్వాల్

- భారత్-శ్రీలంక రెండో టెస్టులో చోటుచేసుకున్న ఘటన
- ఔటయ్యాక బౌలర్ ఫెర్నాండోతో జైస్వాల్ తీవ్ర వాగ్వాదం
- ఒకరినొకరు ఎదుర్కొని తలలతో ఢీకొన్నంత పనిచేసిన ఆటగాళ్లు
- వికెట్‌కు ముందు ఫెర్నాండో బౌలింగ్‌లో జైస్వాల్ హ్యాట్రిక్ ఫోర్లు




**హైదరాబాద్ పెన్ పవర్:** కొలంబో వేదికగా భారత్, శ్రీలంక జట్ల మధ్య జరుగుతున్న సిరీస్‌లోని చివరి టెస్టు మ్యాచ్‌లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్, లంక పేసర్ అసిత ఫెర్నాండో మధ్య మైదానంలో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆదివారం మ్యాచ్ తొలి రోజు లంచ్ విరామానికి కొద్దిసేపటి ముందు ఈ ఘటన చోటుచేసుకుంది.టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ ఇన్నింగ్స్ 17వ ఓవర్ చివరి బంతికి, ఫెర్నాండో అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను బౌల్డ్ చేశాడు. అయితే, వికెట్ పడిన వెంటనే మైదానంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. శ్రీలంక ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా, యశస్వి డగౌట్ వైపు వెళుతున్న క్రమంలో అసిత ఫెర్నాండో కొన్ని వ్యాఖ్యలు చేశాడు. దీంతో జైస్వాల్ ఒక్కసారిగా వెనక్కి తిరిగి అతడిని నిలదీశాడు.ఆగ్రహానికి గురైన జైస్వాల్, బౌలర్ ఫెర్నాండో వైపు దూసుకెళ్లి వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం ముదరడం, ఒకరికొకరు అత్యంత సమీపంలోకి రావడంతో మైదానంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ గొడవకు ముందు, ఫెర్నాండో బౌలింగ్‌లోనే జైస్వాల్ వరుసగా మూడు బంతుల్లో మూడు బౌండరీలు బాదాడు. ఆ తర్వాత బంతికే యశస్వి అవుట్ కావడంతో ఫెర్నాండో దూకుడుగా సంబరాలు చేసుకోవడం, లంక ఆటగాళ్ల వ్యాఖ్యలు జైస్వాల్ ప్రతిస్పందనకు కారణమయ్యాయి. ఈ ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ 53 బంతులు ఎదుర్కొని 9 ఫోర్ల సాయంతో 45 పరుగులు చేసి వెనుదిరిగాడు.

# బంగ్లాదేశ్ సరికొత్త చరిత్ర.. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తొలిసారిగా టాప్-6



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు టెస్ట్ ఫార్మాట్‌లో సరికొత్త చరిత్రను లిఖించింది. ఐసీసీ ఆదివారం విడుదల చేసిన తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంకును కైవసం చేసుకుంది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో బంగ్లాదేశ్ జట్టు తొమ్మిదో స్థానాన్ని దాటి పైకి రావడం ఇదే ప్రప్రథమం కావడం విశేషం. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో చారిత్రక ప్రదర్శన కనబరచడమే ఈ ఘనతకు కారణమైంది.ఇటీవల ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను బంగ్లాదేశ్ 1-1తో సమం చేసింది. తొలి టెస్టులో అద్భుత విజయం సాధించి, రెండో టెస్టులో ఓటమిపాలైంది. ఈ ప్రదర్శనతో 78 రేటింగ్ పాయింట్లతో ఆరో స్థానానికి చేరుకుంది. ఈ క్రమంలో వెస్టిండీస్, పాకిస్థాన్, శ్రీలంక వంటి బలమైన జట్లను వెనక్కి నెట్టింది.

ఈ ఘనతపై బంగ్లాదేశ్ టెస్ట్ కెప్టెన్ నజ్ముల్ హోస్సేన్ శాంటో ఆనందం వ్యక్తం చేశాడు. "టెస్టుల్లో ఆరో ర్యాంకుకు చేరుకోవడం కచ్చితంగా శుభవార్తే. ఇది మాకు అతిపెద్ద విజయం" అని వ్యాఖ్యానించాడు. అయితే, రెండో టెస్టులో ఓటమి నేపథ్యంలో, మరింత మెరుగ్గా ఆడి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డాడు.

**తరచుగా పర్యటనలు జరగాలి: కెప్టెన్ శాంటో**

సందర్భంగా శాంటో కీలక విజ్ఞప్తి చేశాడు. ఆస్ట్రేలియా వంటి దేశాల్లో తమ జట్టు తరచుగా పర్యటించాలని కోరాడు. "మేము 23 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ ఆడాం. ఇలాంటి కఠినమైన పరిస్థితుల్లో, నాణ్యమైన జట్టుతో పోటీపడటం అంత సులభం కాదు. ఇక్కడికి తరచుగా వస్తుంటే, మా ఆటగాళ్లకు పరిస్థితులపై అవగాహన పెరుగుతుంది, అనుభవం వస్తుంది" అని అన్నాడు. కేవలం టెస్టులే కాకుండా, వన్డేలు, టీ20ల కోసం కూడా ఆస్ట్రేలియాకు పర్యటించే అవకాశాలు పెంచాలని విజ్ఞప్తి చేశాడు.

**సిరీస్ సాగిందిలా..**

డార్విన్‌లో జరిగిన తొలి టెస్టులో బంగ్లాదేశ్ చారిత్రక విజయాన్ని అందుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై ఇదే వారి తొలి టెస్ట్ గెలుపు. ఆ మ్యాచ్‌లో తొలుత ఆసీస్‌ను 198 పరుగులకే ఆలౌట్ చేయడంలో హసన్ మహమూద్ (6 వికెట్లు) కీలక పాత్ర పోషించాడు. అనంతరం తంజీద్ హసన్ సెంచరీతో రాణించడంతో బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 426 పరుగుల భారీ స్కోరు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 57 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది.అయితే, రెండో టెస్టులో ఆస్ట్రేలియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. పేసర్ మిచెల్ స్టార్క్ (మ్యాచ్‌లో 10 వికెట్లు) బంగ్లా పతనాన్ని శాసించాడు. అతని ధాటికి బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 64 పరుగులకే, రెండో ఇన్నింగ్స్‌లో 95 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ పర్యటన బంగ్లాదేశ్‌కు ఒకవైపు చారిత్రక ర్యాంకును అందివ్వగా, మరోవైపు కఠిన పరిస్థితుల్లో నిలకడగా రాణించాలంటే మరిన్ని అవకాశాలు అవసరమని గుర్తు చేసింది.

# అనిపిస్తున్న కృతి శెట్టి లేటెస్ట్ పిక్స్.. వీకెండ్ లుక్ చూస్తే ఫిదా కావాల్సిందే!

టాలీవుడ్ లో ఉప్పెన సినిమాలో బెబమ్మగా పరిచయమై తొలి చిత్రంతోనే సౌత్ ఇండియా వ్యాప్తంగా కుర్రకారు గుండెల్లో స్థానం సంపాదించుకుంది కృతి శెట్టి. కేవలం తెలుగులోనే కాకుండా తమిళ, మలయాళ భాషల్లోనూ వరుస సినిమాలు చేస్తూ నేటితరం క్రేజీ హీరోయిన్‌గా దూసుకుపోతోంది. తాజాగా ఈ భామ 'వీకెండ్ వైబ్స్' అంటూ సోషల్ మీడియాలో షేర్ చేసిన క్యాజువల్, క్లీన్-గర్ల్ లౌంజ్‌వేర్ ఫొటోషూట్ పిక్స్ ఇప్పుడు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతూ అందరినీ ఆకట్టుకుంటున్నాయి.



లైమ్ గ్రీన్ దుస్తుల్లో ఆకట్టుకుంటున్న రాయ్ లక్ష్మి

**సింపుల్ అండ్ స్టైలిష్ లౌంజ్‌వేర్ లుక్:**

తాజా ఫొటోషూట్‌లో కృతి శెట్టి చాలా సింపుల్‌గా, అంతే స్టైలిష్‌గా కనిపిస్తోంది. రిబ్బెడ్ నిట్ క్రాప్డ్ ట్యాంక్ టాప్, దానికి మ్యాచింగ్ వైడ్-లెగ్ నిట్ ప్యాంట్స్ ధరించి ఇంట్లో ప్రశాంతంగా గడిపే క్యాజువల్ వీకెండ్ లుక్‌ను ప్రదర్శించింది. ఇక సన్-హైలైటెడ్ బ్రౌన్ హెయిర్ వేవ్స్ భుజాలపై పడుతుండగా, న్యూడ్ లిప్‌స్టిక్, లైట్ మేకప్‌తో మినిమల్ హై-ఫ్యాషన్ స్ట్రీట్ స్టైల్‌ను ఎంతో పర్‌ఫెక్ట్‌గా మేనేజ్ చేసి అభిమానులను మైమరపింపజేస్తోంది.



**'ఉప్పెన' నుంచి 'మనమే' వరకు బిజీ బిజీ:**

తన డెబ్యూ మూవీ 'ఉప్పెన' నటనకు గాను ఫిల్మ్‌ఫేర్, సైమా వంటి ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్న కృతి, ఆ తర్వాత వరుస ప్రాజెక్టులతో బిజీగా మారింది. ఇటీవలే శర్వానంద్‌తో కలిసి నటించిన 'మనమే' చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఇక నటనతో పాటు అందంతోనూ మెప్పిస్తున్న ఈ కన్నడ కుట్టికి దక్షిణాదిలో వరుస అవకాశాలు తలుపు తడుతున్నాయి.

**2040 కాన్సెప్ట్‌తో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ':**

తాజాగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, ఎస్. జె. సూర్యలతో కలిసి ఆమె నటించిన సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' థియేటర్లలోకి వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇక 2040 నాటి టెక్నాలజీ ప్రపంచం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో కృతి 'ధీమా' అనే ఆన్‌లైన్ ఇన్‌ఫ్లుయెన్సర్ పాత్రలో కనిపించింది. తన నిజ జీవితానికి దగ్గరగా ఉన్న ఈ పాత్రలో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. వెండితెరపై నటనతో అలరించడమే కాకుండా, సోషల్ మీడియాలో తన గ్లామరస్ అండ్ స్టైలిష్ పిక్స్‌తో నిరంతరం అభిమానులకు టచ్‌లో ఉంటోంది కృతి శెట్టి. తక్కువ వయసులోనే అవార్డులు, హిట్లు సాధిస్తూ టాలెంట్, గ్లామర్ రెండింటినీ సమంగా బ్యాలెన్స్ చేస్తున్న ఈ క్యూట్ బ్యూటీ.. రాబోయే రోజుల్లో సౌత్ ఇండస్ట్రీలో మరిన్ని సంచలనాలు సృష్టించడం ఖాయం..



అందమైన ఐవరీ రంగు చీరలో అద్భుతంగా కనిపిస్తున్న జాన్వీ కపూర్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com